V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
17-10-2024
సంపుటి : 01 | సంచిక : 165 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





## కేంద్ర ఉద్యోగులకు 3శాతం
# డీఏ పెంపు



### గోధుమ సహా 6 పంటలకు మద్దతు ధర పెంచిన సర్కార్

- రబీ సీజన్‌కు నాన్-యూరియా ఎరువులకు రూ.24,475 కోట్ల సబ్సిడీకి పచ్చజెండా
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలను వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుకగా 3శాతం డీఏ పెంపునకు ఆమోదం తెలిపింది. తాజా పెంపుతో ఇప్పటివరకు ఉన్న 50 శాతం డీఏ 53 శాతానికి చేరనుంది. ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచే దీన్ని అమలు చేయనున్నారు. దీని వల్ల కేంద్ర ఖజానాపై రూ.9448 కోట్ల అదనపు **మిగతా2లో...**

# ఆత్మ పరిశీలన చేసుకోండి

### సరిహద్దుల్లో ఉగ్రవాదానికి అవకాశం ఉండదు
### పాక్ ప్రభుత్వానికి జైశంకర్ చురకలు
### ఎస్‌సీఓ సదస్సులో మన దేశ వైఖరిని వినిపించా



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మాట్లాడిన భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి చురకలు వేశారు. సీమాంతర ఉగ్రవాదం గురించి ప్రస్తావించి విమర్శలు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నమ్మకం, సహకారం, స్నేహం లోపిస్తే పొరుగువారు దూరమవుతారని వ్యాఖ్యానించారు. ''సరిహద్దుల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాద కార్యకలాపాలు ఉంటే.. ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యం, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాలకు **మిగతా2లో...**

# గాల్లోకి ఎగిరి... కాల్వలో పడిన కారు

### ఏడుగురి దుర్మరణం..ఒకరికి గాయాలు
### మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
### ముఖ్యమంత్రి సంతాపం




**విశ్వంభర, మెదక్:** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ఏడుగురిని బలితీసుకుంది. జిల్లాలోని శివంపేట మండలం ఉసిరికపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గుంత వారి పాలిట మృత్యువుగా మారింది. అతివేగం, రహదారిపై ఉన్న గుంతను గమనించకపోవడంతో కారు అదుపుతప్పి గాల్లోకి లేచి కాల్వలోపడిపోయింది. ఈ ప్రమాదలో కారులో ఉన్న ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు. వాహనం నడుపుతున్న వ్యక్తి మాత్రమే గాయాలతో బయటపడ్డాడు. ప్రమాద సమయంలో కారు వేగంగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. గుంతలో కారు పడి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని **మిగతా2లో...**



# హైదరాబాద్ విస్తరణకు అన్నిచర్యలు

### బ్రాండ్ ఇమేజ్ పెరిగితే నిర్మాణరంగం విస్తరిస్తుంది

### బిల్డర్ల సమస్యలను పరిష్కరిస్తాం
### నగర అభివృద్ధికి రూ.పదివేల కోట్లు కేటాయించాం
### బిల్డర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**విశ్వంభర,హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరాన్ని బాగా విస్తరింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, విస్తరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంలో వెనుకాడే ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో బిల్డర్స్ తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సమావేశమయ్యారు. బిల్డర్స్ సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, యావత్ మంత్రిమండలి మీతో పంచుకోవాలని కోరినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు బిల్డర్లకు తెలిపారు. హైదరాబాద్ నగరం విస్తరణలో బిల్డర్స్ పాత్ర బలంగా **మిగతా2లో...**

## పేలిన పెట్రోల్ ట్యాంకర్

### 94 మంది మృతి
### మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**నైజీరియా:** నైజీరియాలో పెను విషాదం చోటుచేసుకుంది. పెట్రోల్ ట్యాంకర్ పేలి 94 మంది మృతి చెందారు. జిగావా రాష్ట్రంలోని మజియా పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన **మిగతా2లో...**

## సీఈసీకి తప్పిన ప్రమాదం

### హెలీకాప్టర్ అత్యవసర ల్యాండింగ్
### ప్రతికూల వాతావరణమే కారణం
### ఉత్తరాఖండ్‌లోని మున్సియారీకి వెళ్తుండగా ఘటన



**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. సీఈసీ, ఉత్తరాఖండ్ అదనపు సీఈవో విజయ్‌కుమార్ ప్రయాణిస్తున్న **మిగతా2లో...**

## జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇళంబరితి

- పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు
- తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో నియామకాలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జిలను నియమించింది. డీవోపీటీ ఆదేశాల **మిగతా2లో...**

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## నేటి చికెన్ ధరలు



| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 126 | ₹ 148 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 215 | ₹ 244 |

## ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు

- నూతన కార్యక్రమానికి శ్రీకారం
- ఉద్యోగం చేయడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి
- కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి
- రాష్ట్రంలో ఐదుజోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు..
- ఆధునిక టెక్నాలజీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం
- ఏపీ కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు
- మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. ఏపీ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. **మిగతా2లో...**





## బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టేందుకే హైడ్రా

- రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డంగా నిలబడుతాం
- పేదలకు అండగా ఉంటాం
- మూసీ పేరుతో జరిగే దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి భారీ జరిమానా

### పౌడర్ ఉపయోగిస్తే క్యాన్సర్ వస్తోందని ఆరోపణ
### విచారణ జరిపిన ట్రయల్ కోర్టు
### పిటిషనర్‌కు రూ.126 కోట్లు చెల్లించాలని తీర్పు

**వాషింగ్టన్:** జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ టాల్కమ్ పౌడర్‌తో క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ టాల్కమ్ పౌడర్‌ను ఉపయోగించడం వల్లే తనకు అరుదైన క్యాన్సర్ వచ్చిందని అమెరికాలో ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్ట్ జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి పెద్ద మొత్తంలో జరిమానా విధించింది. ప్లాట్‌కిన్ ఇవాన్ అనే వ్యక్తి 2021లో తాను చేయించుకున్న పరీక్షల్లో తనకు **మిగతా2లో...**



## పంచాంగం

**17-10-2024, గురువారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** పౌర్ణమి సా.04.56వరకు తర్వాత పాడ్యమి (పూర్తి)
**నక్షత్రం:** రేవతి సా.04.20వరకు
**సూర్యోదయం:** ఉ.6.13
**సూర్యాస్తమయం:** సా.5.49
**వర్జ్యం:** ఉ.09.55 నుంచి ఉ.11.19వరకు
**దుర్ముహూర్తం:** ఉ.10.05 నుంచి ఉ.10.51వరకు తిరిగి మ.02.43 నుంచి మ.03.30 వరకు
**రాహుకాలం:** మ.01.28 నుంచి మ.02.55వరకు
**అమృత ఘడియలు:** మ.02.14 నుంచి మ.03.38 వరకు

# గాల్లోకి ఎగిరి...కాల్వలో పడిన కారు

(మొదటి పేజీ తరువాయి)
పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో ఎవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం కనిపించలేదు. కారులో ఉన్న 8 మందిలో ఏడుగురు ఊపిరి ఆడక చనిపోయారు. ప్రమాదం గురించి తెలిసిన స్థానికులు కాలువలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఏడుగురు చనిపోయి ఉన్నారు.

**దావత్ నుంచి వస్తుండగా ..**

మృతులను భీమ్లా తండాకు శాంతి (38), మమత (12), సీతారాం తండాకు చెందిన అనిత (35), హిందూ (13), శ్రావణి (12), తలపల్లి తండాకు చెందిన శివరాం (56), దుర్గి (45) గా గుర్తించారు. ప్రమాదంలో డ్రైవింగ్ సీట్లో ఉన్న నామ్‌సింగ్ (40)కు తీవ్ర గాయాలయ్యాయి. అతని రెండు కాళ్లు విరిగాయి. వైద్యం కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో నామ్‌సింగ్ భార్య శాంతి, కుమార్తె మమత, అత్త, మామ, మరదలు కూడా మృతి చెందినట్లు గుర్తించారు. వీరంతా తూప్రాన్ దగ్గర ముత్యాలమ్మ గ్రామ దేవత దావత్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం పంపించారు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ర్యాష్ డ్రైవింగ్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని అంచనాకు వచ్చారు. ఊపిరి ఆడక ఏడుగురు కారులోనే చనిపోగా డ్రైవర్ నామ్ సింగ్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. అతను ప్రస్తుతం స్పృహలో లేడని తరువాత అతనికి డ్రంక్ డ్రైవ్ పరీక్ష చేసి మద్యం మత్తులో ఉన్నడా లేడా అనేది తెలుస్తామని తెలిపారు.

**ఏడుగిరి మృతి బాధాకరం..సీఎం**

ఈ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్న సీఎం.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స, అవసరమైన సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు మాజీ మంత్రి హరీశ్ రావు కూడా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గాయపడిన నామ్‌సింగ్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



# ఆత్మ పరిశీలన చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)
అవకాశం ఉండదు'' అని మంత్రి వ్యాఖ్యానించారు. ఎక్కడా కూడా పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ సమావేశం అనంతరం మంత్రి ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు పెట్టారు. ''ఇస్లామాబాద్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో మన దేశం ప్రకటనను వినిపించాను. కల్లోల ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు తగినవిధంగా ఎస్‌సీఓ స్పందించాలి'' అంటూ పలు అంశాలను ప్రస్తావించారు. 2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగింది. నాడు ఆ ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఉగ్రవాదాన్ని తాము ఎన్నటికీ సహించబోమని ఈ ఘటనతో భారత్.. పాక్ సహా ప్రపంచదేశాలకు గట్టి సందేశమిచ్చింది. ఇక అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని తన నివాసంలో విందు ఇచ్చారు. ఈసందర్భంగా జైశంకర్, షెహబాజ్‌లు కరచాలనం చేసుకొని కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఎస్సీవో సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహిస్తున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబరులో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పాకిస్థాన్‌లో పర్యటించారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు..

(మొదటి పేజీ తరువాయి)
భారం పడనుందని పేర్కొన్నారు. డీఏ పెంపుతో దాదాపు కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. కాగా.. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది మార్చిలో డీఏను 4 శాతం పెంచిన సంగతి తెలిసిందే. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను కేంద్రం సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ కరవు భత్యాన్ని అందజేస్తారు.

**రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా నిర్ణయాలు..**

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా 'పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్(పీఎం- ఆశా)కు రూ.35వేల కోట్లు ఇచ్చేందుకు ఆమోద ముద్ర వేసింది. రబీ పంట సీజన్‌కు సంబంధించి నాన్-యూరియా ఎరువులకు రూ.24,475 కోట్ల సబ్సిడీకి పచ్చజెండా ఊపింది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు గాను రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను పెంచింది. క్వింటాల్ గోధుమపై ఎంఎస్‌పీని తాజాగా రూ.150కు పెంచడంతో గతంలో రూ.2275గా ఉన్న కనీస మద్దతు ధర రూ.2425కి పెరిగింది.క్వింటాల్‌కు ఆవాలుకు అత్యధికంగా రూ.300పెంచగా.. క్వింటాల్ పెసరకు రూ.275, శెనగలకు క్వింటాల్‌పై రూ.210, ప్రొద్దుతిరుగుడుకు రూ.140, బార్లీకి రూ.130 చొప్పున పెంచారు.

**గంగానదిపై కొత్త రైల్వే కమ్ రోడ్డు వంతెన నిర్మాణం..**

- యూపీలోని వారణాసిలో గంగా నదిపై కొత్త రైల్వే కమ్ రోడ్డు వంతెన నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.2,642 కోట్లు వ్యయం చేయనుంది.

# సీఈసీకి తప్పిన ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)
హెలీకాప్టర్‌ను ప్రతికూల వాతావరణం కారణంగా అత్యవసర ల్యాడింగ్ చేశారు. ఆయన ఉత్తరాఖండ్‌లోని మున్సియారీకి వెళ్తుండగా పిథోరాగఢ్ జిల్లాలో ఘటన చోటుచేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హెలికాప్టర్‌లో ఉన్నవారంతా సురక్షితంగా ఉన్నారని ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెల్లడించింది. హెలికాప్టర్ పర్వత ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో ముందు జాగ్రత్త చర్యగా పైలట్ అత్యవసర ల్యాండింగ్ చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత అధికారుల ప్రయాణం తిరిగి కొనసాగుతుందన్నారు.

# హైదరాబాద్‌లో వర్షం

## పలుచోట్ల ట్రాఫిక్ జామ్

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, కుత్బుల్లాపూర్, సూరారం, ఖైరతాబాద్, బహదూర్‌పల్లి, కొంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లక్డీకాపూల్, పంజాగుట్ట ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, మెదక్ జిల్లాల్లో గురువారం, శుక్రవారం తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆయా జిల్లాల్లోని వర్ష ప్రభావిత ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**సంగారెడ్డిలో భారీ వర్షం.. దాదాపు 7కి.మీల మేర ట్రాఫిక్ జామ్!**

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గణేశ్ గడ్డ నుంచి పటాన్ చెరు వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 7కి.మీల మేర వాహనాలు నిలిచిపోయాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



# జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇళంబరితి

(మొదటి పేజీ తరువాయి)
మేరకు తెలంగాణ నుంచి వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రాస్, ఆమ్రపాలి రిలీవ్ అయ్యారు. టూరిజంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్.శ్రీధర్, విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా, మహిళా సంక్షేమశాఖ కార్యదర్శిగా టి.కె.శ్రీదేవి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇళంబరితి, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోగా ఆర్.వి.కర్ణన్, ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టినాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

**హైకోర్టులో ఏం జరిగింది?**

డీవోపీటీ ఉత్తర్వులపై ఐఏఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, సృజన, శివశంకర్, హరికిరణ్‌లకు తెలంగాణ హైకోర్టులోనూ ఊరట దక్కలేదు. రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న వారి పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ట్రైబ్యునల్‌లో నవంబరు 4న విచారణ ఉందని, అప్పటి వరకు రిలీవ్ చేయవద్దని ఐఏఎస్‌ల తరఫు న్యాయవాది కోరారు. స్టే ఇస్తూ పోతే ఈ అంశం ఎన్నటికీ తేలదని ఈ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. వివాదాన్ని తేలుస్తాం.. ముందు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ''మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు.. ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దు. ఎవరు ఎక్కడ పనిచేయాలనేది కేంద్రం నిర్ణయిస్తుంది. మరోసారి పరిశీలించాలని డీవోపీటీని ఆదేశించమంటారా? '' అని ధర్మాసనం అడిగింది. రిలీవ్ చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలని రెండు రాష్ట్రాలు డీవోపీటీని కోరాయని ఐఏఎస్‌ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గత పదేళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని వాదనలు వినిపించారు. క్యాట్ తుది తీర్పు ఇచ్చే వరకు రిలీవ్ చేయవద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదనలు వినిపించారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలో కోర్టులు నిర్ణయించవద్దని, క్యాట్ స్టే ఇవ్వకపోవడం సరైన నిర్ణయమేనన్నారు. డీవోపీటీ నిర్ణయం ఎలా సరైందో పూర్తి వివరాలతో క్యాట్‌లో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ధర్మాసనం.. ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)
''ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలు తీసుకొచ్చాం. పర్యాటక, ఐటీ, వర్చువల్ వర్కింగ్ పాలసీలు తీసుకువస్తాం. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో వెళ్తున్నాం. ఉద్యోగం చేయడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తెస్తాయి'' అని సీఎం వివరించారు.



**రాష్ట్రంలో ఐదుజోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు..**

''అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం. ఐదు జోన్లలో (విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ లేదా గుంటూరు, అనంతపురం) ఐదు ఇన్నోవేషన్ రతన్ టాటా హబ్‌లు వస్తాయి. ఆధునిక టెక్నాలజీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం. కొత్త పాలసీలతో ఏపీలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. నాలెడ్జ్ ఎకానమీకి ఏపీ ఇన్నోవేషన్ హబ్‌గా మారాలి. కృష్ణా జలాలు రాయలసీమకు ఇవ్వొచ్చని చెప్పింది ఎన్టీఆర్. అది చేసి చూపించింది తెలుగుదేశం పార్టీ. నదుల అనుసంధానంతోనే ఏపీ అభివృద్ధి. దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునర్ నిర్మించాల్సి ఉంది. భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావాల్సి ఉంది. ఆదాయం పెంచి ప్రజలకు పంచాలన్నదే మా నినాదం. ఆక్వా కల్చర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ తయారవుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. ఫుడ్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ మారుతుంది. దేశంలో తొలిసారిగా పరిశ్రమల డీకార్బనైజేషన్‌ను ప్రోత్సహిస్తాం'' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రూ.30లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యం...**

''జీరో బడ్జెట్, నేచురల్ ఫార్మింగ్‌కు ఏపీ చిరునామా. నవంబరు మొదటి వారంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ వచ్చేలా మన ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతాం. గ్రీన్ ఎనర్జీ, నదుల అనుసంధానం, పోర్టులను కూడా అనుసంధానం చేస్తాం. 40 బిలియన్ డాలర్ల ఎగుమతులు.. రూ.30లక్షల కోట్ల పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉత్పత్తి వ్యయం తగ్గేలా చర్యలు ఉంటాయి. విశాఖ నుంచి భావనపాడు వరకు రహదారి నిర్మిస్తాం. భావనపాడులో 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం. ఉత్తరాంధ్రను కూడా పోర్టులు, టూరిజంతో అభివృద్ధి చెందేలా కార్యాచరణ. ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం'' అని సీఎం తెలిపారు.

# హైదరాబాద్ విస్తరణకు అన్నిచర్యలు

(మొదటి పేజీ తరువాయి)
ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం మనస్ఫూర్తిగా కోరుకుంటుంది అని తెలిపారు. హైదరాబాద్ ను విశ్వ నగరంగా మార్చేందుకు తాజా బడ్జెట్లో పదివేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ కోసం మాత్రమే వీటిని ఖర్చు చేస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, వరల్డ్ క్లాస్ స్టేడియం లు , స్కిల్ యూనివర్సిటీ వంటి గొప్ప ప్రాజెక్టులతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలపబోతున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు బిల్డర్స్ కోరిన విధంగా బ్యాంకర్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రధాన ప్రభుత్వ శాఖల ద్వారా బిల్డర్స్ కోరుకున్న విధంగా స్పష్టత ఇప్పిస్తామని బిల్డర్లకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగర రాజ్యాంగ విస్తరించింది. ప్రస్తుతం ఉన్న చెరువులు, కుంటలు కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉన్నత లక్షమే తప్ప ఈ ప్రభుత్వానికి మరో ఉద్దేశం లేదని వివరించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచితేనే నిర్మాణరంగం పెరుగుతుంది, మూసీ నదిని పునర్జీవింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బలంగా భావిస్తుందని తెలిపారు. అనేక దశాబ్దాలుగా ఉన్న చెరువులు, కుంటలు క్రమంగా కనుమరుగవుతున్నాయి,



వాటిని కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపైన ఉందని వివరించారు. బిల్డర్స్ సంపద సృష్టికర్తలు.. మీ సమస్యలను గౌరవించి పరిష్కరిస్తాం.. రాష్ట్ర ప్రభుత్వం మీతో ఉంది.. రాష్ట్రంలో నిర్మాణరంగం ఎదగాలని యావత్ మంత్రి మండలి బలంగా కోరుకుంటుందని తెలిపారు. సమస్యలపై ఒక కమిటీ ఏర్పాటు చేసుకుంటామని బిల్డర్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు, మీ అభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాను అని తెలిపారు. అన్ని అంశాలు ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం చేస్తామని తెలిపారు.

**హైదరాబాద్ నగర అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించారు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ నగరం అభివృద్ధికి పదివేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి తెలిపారు. బిల్డర్ల సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఆ ఆలోచన మేరకే బిల్డర్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బిల్డర్ లకు సంబంధించిన ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తాం.. సరైన రీతిలో స్పందిస్తాం, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని బిల్డర్స్ కు హామీ ఇచ్చారు. హైదరాబాద్ ను గొప్ప నగరంగా తీర్చేందుకు రాష్ట్ర క్యాబినెట్ యావత్తు ప్రతిరోజు పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్, తెలంగాణ క్రెడాయ్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి, హైదరాబాద్ క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి, క్రెడాయ్ మాజీ ప్రెసిడెంట్ శేఖర్, నారెడకో ప్రెసిడెంట్ విజయ సాయి, తెలంగాణ బిల్డర్స్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రావు, తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టేందుకే హైడ్రా

**విశ్వంభర, హైదరాబాద్:** బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టేందుకే హైడ్రాను తీసుకొచ్చారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా వసూళ్లతోనే నాంపల్లిలో కాంగ్రెస్, మజ్లిస్ నేతల గొడవ జరిగిందన్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లకు తాము అడ్డంగా నిలబడతామని, పేదలకు అండగా ఉంటామని.. రక్షణ కవచంలా నిలుస్తామన్నారు. చెప్పారు. హైదరాబాద్‌లో ఎస్టీపీలు (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు), ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో 1980లో కాంగ్రెస్ ప్రభుత్వమే 20 వేల మందికి పట్టాలు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. అవే ఇళ్లను ఇప్పుడు ఆక్రమణలని అంటున్నారని విమర్శించారు. ''బస్తీల్లోకి వెళ్లి భరోసా కల్పిస్తాం.. లీగల్ సెల్ ద్వారా అండగా ఉంటాం. రాడార్ స్టేషన్‌తో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా రాదు. పర్యావరణానికి నష్టం కలిగించే ప్రాజెక్టుకు అనుమతి ఎలా ఇస్తారు? మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50 వేల కోట్లు ఎలా తెస్తారు? ప్రభుత్వ అనాలోచిత విధానాలతోనే పేదలకు ఇబ్బందులు. సరైన ప్రణాళిక లేకుండా ఇష్టం వచ్చినట్లు ముందుకెళ్తున్నారు. మూసీ విషయంలో రోజుకోమాట మాట్లాడుతున్నారు. దీని పరిధిలోని పేదల ఇళ్లు కూలుస్తామని అంటున్నారు మూసీ పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్తాం. మురుగునీటి శుద్ధి కేంద్రాలను వంద శాతం మేమే పూర్తిచేశాం'' అని కేటీఆర్ తెలిపారు.

# పేలిన పెట్రోల్ ట్యాంకర్

(మొదటి పేజీ తరువాయి)
చోటుచేసుకుంది. కనో నుంచి బయల్దేరిన ఓ పెట్రోల్ ట్యాంకర్ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో హైవేపై బోల్తా పడింది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది స్థానికులు ఇంధనం కోసం ట్యాంకర్ వద్దకు వెళ్లారు. వారు పెట్రోల్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ట్యాంకర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటనలో 94 మంది మృతి చెందినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. మరో 50 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ట్యాంకర్‌కు దూరంగా ఉండమని ప్రజలను హెచ్చరించినప్పటికీ ఎవరూ వినిపించుకోలేదని, ఒక్కసారిగా ఎగబడటంతో మృతుల సంఖ్య భారీగా ఉందని అధికారులు చెబుతున్నారు.

# జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి భారీ జరిమానా

(మొదటి పేజీ తరువాయి)
మెసోథెలియోమాన్ అనే అరుదైన క్యాన్సర్ వచ్చిందని పేర్కొన్నారు. అయితే జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ టాల్కమ్ పౌడర్ వాసన పీల్చినందునే తనకు ఈ క్యాన్సర్ వచ్చిందని ఆ వ్యక్తి పిటిషన్‌లో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఫెయిర్‌ఫీల్డ్ కౌంటీ, కనెక్టికట్ సుపీరియర్ కోర్టు విచారణ జరిపింది. అనంతరం బాధితుడికి రూ.126 కోట్ల పరిహారంతో పాటు అదనపు ఖర్చులు సైతం చెల్లించాలని తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎరిక్ హాస్ స్పందించారు. కేసుకు సంబంధించిన వాస్తవాలను వినకుండా ట్రయల్ జడ్జి తీర్పు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై తాము పోరాడతామన్నారు. అదేవిధంగా టాల్కమ్ సురక్షితమైనదని, ఆస్‌బెస్టాస్ క్యాన్సర్‌కు కారణం కాదని తెలిపారు. ఇక, జాన్సన్ అండ్ జాన్సన్ విక్రయించే బేబీ టాల్కమ్ పౌడర్‌లో క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. టాల్కమ్ పౌడర్‌లో వినియోగించే ఆస్‌బెస్టాస్ క్యాన్సర్‌కు కారకంగా మారుతోందని పరిశోధనలు సైతం వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే 62 వేల మందికి పైగా కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను 9 బిలియన్ డాలర్లతో పరిష్కరించాలని కంపెనీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఇటువంటి తీర్పు వెలువడడం గమనార్హం. మరోవైపు 2020లోనే అమెరికా, కెనడా మార్కెట్‌లలో ఈ టాల్కమ్ పౌడర్ విక్రయాలను జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ నిలిపివేసింది.



# అట్టహాసంగా సాగిన సీఎం కప్ 2024 టార్చ్ రిలే

- ఉమ్మడి వరంగల్ జిల్లాను చుట్టుముట్టిన క్రీడాజ్యోతి
- వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలో ఉత్సాహంగా టార్చ్ రిలే
- మేళ తాళాలతో ప్రతి-చోట స్వాగతం
- క్రీడాకారులతో కిటకిటలాడిన ర్యాలీలు




**విశ్వంభర, వరంగల్ :** గ్రామీణ క్రీడాకారులకు ఉత్సాహం కల్పించేందుకు నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 క్రీడా పోటీల సన్నాహక చర్యలో భాగంగా నిర్వహిస్తున్న టార్చర్ ఇదే ర్యాలీ బుధవారం వరంగల్, హనుమకొండ మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో క్రీడాకారుల కోలాహలం మధ్య విజయవంతంగా సాగింది. నాలుగు జిల్లా కేంద్రాల్లో మేళతాళాలతో బాణాసంచా బతుకమ్మ పాటలతో క్రీడాజ్యోతికి క్రీడాకారులు స్వాగతం పలికారు

**వరంగల్ లో...**
వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడాజ్యోతి ర్యాలీకి క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.బాణాసంచా మోత బతుకమ్మ ఆటపాటలతో కోలాహలంగా ఈ కార్యక్రమం కొనసాగింది.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద డిసిపి సెంట్రల్ షేక్ సలీమా అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి డివైస్ ఓ టీ.వీ. ఎల్ సత్యవాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హనుమకొండలో..**
హనుమకొండ లో జరిగిన కలెక్టర్ పి.ప్రావీణ్య వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రజలు మేళతాళాలతో క్రీడాకారులకు స్వాగతం పలికారు . డి వై ఎస్ ఓ గుగులోత్ అశోక్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

**మహబూబాబాద్ లో..**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అత్యంత ఉత్సాహ భరితంగా కార్యక్రమం కొనసాగింది. మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్, జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రాందాన్, లో అతిథులుగా హాజరయ్యారు ఈ కార్యక్రమాన్ని డివైఎస్ ఓ అనిల్ కుమార్ సమన్వయం చేశారు .

**జనగామలో..**
జనగామ జిల్లా కేంద్రంలో జన సందోహం మధ్య సీఎం కప్ టార్చ్ రిలే 20 24 కొనసాగింది.
ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా, డిసిపి రాజమహేంద్ర నాయక్ లు హాజరై క్రీడాకారులలో ఉత్సాహం నింపారు. జనగామ డివైఎస్ ఓ వెంకటరెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా చుట్టుముట్టిన క్రీడాజ్యోతి ర్యాలీ అధ్యంతం క్రీడాకారులకేరింతల మధ్య ఉత్సాహభారితంగా కొనసాగింది.వరంగల్ హనుమకొండ మహబూబాబాద్ జనగామ జిల్లాల్లో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు వెటర్న్ క్రీడాకారులు యువ క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ అకాడమీ విద్యార్థులు స్పోర్ట్స్ అథారిటీ రెగ్యులర్ ట్రైనీలు ప్రతిచోట ఉత్సాహంగా పాల్గొన్నారు.
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు ఏ. ఎన్.కె గోకుల్, మధు, రతన్ బోస్, నాలుగు జిల్లాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ సమన్వయం చేశారు.తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి అజీజ్ ఖాన్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, ఖో ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యామ్, వరంగల్ నీట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ ఎ. టి. బి. టీ. ప్రసాద్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కళాశాలల బంద్‌కు సంఘీభావం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించని కారణంగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు డిగ్రీ మరియు పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. సకాలంలో జీతాలు చెల్లించలేకపోవడం వల్ల ఈ కళాశాల పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర సిబ్బంది తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.
యాజమాన్యాలు, సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల తీవ్ర ఇబ్బందులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని, నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు తలపెట్టిన బందు దురదృష్టకరమే అయినప్పటికీ, ఇది తప్పనిసరి పరిణామంగా భావిస్తున్నాము. అన్ని ప్రొఫెషనల్ కళాశాలలు కూడా ఇదే విధమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దృష్ట్యా మా అసోసియేషన్ తరపున ఈ బందుకు సంఘీభావం తెలియజేస్తున్నాము.
రాష్ట్ర ప్రభుత్వం త్వరితంగా స్పందించి అన్ని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలనీ, తద్వారా తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల మనుగడనూ మరియు విద్యార్థుల భవిష్యత్తునూ కాపాడాలని మా అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని తెలంగాణ ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కాలేజీల యాజమాన్య సంఘం ఛైర్మన్ ఎన్.గౌతమ్ రావు, సెక్రెటరీ డా.కె.సునీల్ కుమార్ తెలిపారు.

## కెనడాలో ఖలిస్థానీలకు పాక్ అండ

**టొరంటో:** తమ దేశంలో ఉన్న ఖలిస్థానీయులకు పాకిస్థాన్ మద్దతు ఉందని కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ (సీఎస్ఐఎస్) డైరెక్టర్ వనెస్సా లాయిడ్ కొన్ని వారాల క్రితమే తెలిపారు. కెనడా రాజకీయాల్లో పాకిస్థాన్ వారిని ఆధారంగా చేసుకొని కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గత నెల ఫారెన్ ఇంటర్‌ఫియర్స్ కమిషన్ ఎదుట లాయిడ్ ఇచ్చిన వాగ్మూలం ఇప్పుడు తెరపైకి వచ్చింది. ''భారత ప్రభావం తగ్గించేందుకు పాకిస్థాన్ స్థిరంగా పనిచేస్తోంది. నేరుగా ఖలిస్థానీ వేర్పాటువాదంపై ఇస్లామాబాద్ ప్రభావం ఉంది'' అని సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన విచారణలో లాయిడ్ పేర్కొన్నారు. కెనడాలో విదేశీయుల జోక్యంపై ఈ విచారణ జరిగింది. పాకిస్థాన్ నేరుగా కెనడా గడ్డపైనుంచే ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు లాయిడ్ వెల్లడించారు. దీనిపై ట్రూడో సర్కారు నోరు మెదపడం లేదు.

స్వదేశంలోనే ట్రూడోపై విమర్శలు..
ట్రూడో ప్రభుత్వం తీరుపై కెనడా పత్రికలే తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ కథనాలు ప్రచురించాయి. సిక్కు వేర్పాటువాదానికి కెనడానే ఆశ్రయం ఇచ్చిందని ఆ దేశానికి చెందిన నేషనల్ పోస్టు పత్రిక ఓ కథనంలో పేర్కొంది. ట్రూడో సర్కారు ప్రవాసీయులను ఆధారంగా చేసుకొని రాజకీయాలు చేస్తున్నారని పేర్కొంది. ఇక రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు ఆధారాలు చూపకుండా భారత్‌పై ఆరోపణలు చేయడాన్ని తప్పు పట్టింది. న్యూదిల్లీ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసినా.. పట్టించుకోకుండా దౌత్య సంబంధాలు దిగజారడానికి ట్రూడో వైఖరి కారణమైందని అందులో అభివర్ణించింది. ఖలిస్థానీ వేర్పాటువాదులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపింది. ఈ కథనాన్ని సీనియర్ జర్నలిస్టు జాన్ ఐవిసన్ రాశారు. ది నేషనల్ టెలిగ్రాఫ్ పత్రిక సీనియర్ కరస్పాండెంట్ తన కథనంలో ట్రూడో వైఖరిని ప్రశ్నించారు. భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగినా.. ట్రూడో ఆధారాలను బహిర్గతం చేయడంలో మరోసారి విఫలమయ్యారని తప్పు పట్టింది. తన మాటను నమ్మాలనే స్థితిలోనే ఆయన ఉన్నారని ఎద్దేవా చేశారు. ''ఈ వివాదం కారణంగా కెనడా చివరికి బిలియన్ల డాలర్లు నష్టం చవిచూస్తుంది. కేవలం జగ్మీత్‌సింగ్ అతడి ఖలిస్థానీ గ్యాంగ్‌ను బుజ్జగించేందుకే ఇదంతా జరుగుతోంది'' అని తన కథనంలో పేర్కొన్నారు.

## చెన్నైలో భారీగా వరదలు.. నీట మునిగిన రజనీకాంత్ ఇల్లు

**చెన్నై:** ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడ చూసినా వరదలు ముంచెత్తాయి. అయితే, నగరంలోని పోయెస్ గార్డెన్‌లోని రజనీకాంత్ విలాసవంతమైన విల్లా సైతం నీటిలో ముగినింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆయన ఇంట్లోకి నీరు చేరింది. ప్రస్తుతం వరదలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భారీ వర్షాలకు నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సూపర్‌స్టార్ రజనీ ఇంటి పరిసర ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరద ఉన్నది. స్థానిక అధికారులు వెంటనే నీటిని బయటకు తీసేందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అయితే, వీడియోలో రజనీతో పాటు ఆయన కుటుంబీకులు ఎవరూ కనిపించలేదు.రజనీకాంత్ ఇల్లు వరదలో చిక్కుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ చెన్నైలో వచ్చిన వరదల సమయంలోనూ ఇల్లు నీటమునిగింది. భారీ వర్షాలతో చెన్నైలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. తమిళనాడు ప్రభుత్వం స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించింది. పలు సంస్థలు ఇంటి నుంచే పని చేయాలని ఉద్యోగులకు సూచించాయి. వర్షాల నేపథ్యంలో చెన్నై కార్పొరేషన్ 1913 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. తమిళనాడు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహాయ కేంద్రం గురించి సమాచారం కోసం వాట్సాప్ కాంటాక్ట్ ఆప్షన్ (9445869848) అలాగే అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్‌లైన్ 1070 నెంబర్‌ని ఏర్పాటు చేసింది.

# గ్రూప్-1 అభ్యర్థుల నిరసన

- మెయిన్స్ వాయిదా వేయాలని డిమాండ్
- అశోక్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్1 అభ్యర్థులు మరోసారి నిరసనకు దిగారు. గ్రూప్1 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు నిరసన చేపట్టారు. గ్రూప్1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపైకి అభ్యర్థులు రావడంతో.. భారీగా పోలీసులను మోహరించారు. అనేకమంది అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌క తరలించారు. గ్రూప్1 మెయిన్ పరీక్షలకు ఇటీవల హైకోర్టు అనుమతి ఇచ్చింది. గ్రూప్1 నోటిఫికేషన్లు సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది.
ఈ నేపథ్యంలో గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా ఈ నెల 21 నుంచి జరగనున్నాయి. ప్రిలిమ్స్‌లోని ఏడు ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. వాటికి మార్కులు కలిపి మళ్లీ కొత్త జాబితా ఇవ్వాలని కోర్టును కోరారు. ప్రిలిమ్స్‌కి, రిజర్వేషన్ల జీవో 33, తదితర అంశాలపై మొత్తంగా గ్రూప్1పై హైకోర్టులో దాదాపు 15కిపైగా కేసులు నమోదయ్యాయి. వాటన్నింటిని కోర్టు కొట్టివేసింది. హైకోర్టు పిటిషన్లు కొట్టివేడయంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు హాజరవనున్నారు.

గ్రూప్స్ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలి: కేటీఆర్
సుదీర్ఘకాలంగా గ్రూప్స్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్న పరీక్షల రీ షెడ్యూల్ అంశంలో మొండిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అశోక్ నగర్ లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగ విద్యార్థులు, యువతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషనులకు తరలించడాన్ని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ఉన్నత విద్యావంతులైన యువతి యువకుల నిరసన తెలియజేసే హక్కులను కూడా హరించి వేస్తున్న తీరును కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. గ్రూప్స్ అభ్యర్థులు అనేక అంశాల పైన తమకు న్యాయం చేయాలంటూ హైకోర్టులో పలు కేసులు వేసి న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని, ఈ సమయంలో ప్రభుత్వం ఒక కేసులో వచ్చిన తీర్పును అడ్డుగా పెట్టుకుని మొండిగా ఈనెల 21వ తేదీన గ్రూప్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నం చేయడం దారుణమన్నారు. స్వయంగా విద్యార్థులే గ్రూప్స్ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని కోరుతున్నప్పుడు ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటిని కేటీఆర్ ప్రశ్నించారు. ఇదే అశోక్ నగర్ యువతీ యువకుల వద్దకు వచ్చి రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులు ప్రాధేయపడి ఓట్లు వేయించుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఆకాంక్షలను పక్కనపెట్టి నిరసన నిరంకుశంగా వ్యవహరించడం దారుణం అన్నారు. ఇదే అశోక్ నగర్ వెళ్లి శుద్ధులు చెప్పిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ పార్టీ పెద్దలు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజస్వామిక వైఖరిని గమనించాలని కేటీఆర్ అన్నారు.
గ్రూప్ అభ్యర్థులు నిరసన తెలుపుతున్న ప్రతిసారి పోలీసుల చేత అరెస్టులు, దాడులు చేయిస్తున్న ప్రభుత్వ క్రూరమైన వ్యవహారాన్ని తెలంగాణ సమాజం గమనిస్తుందని కేటీఆర్ అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్స్ అభ్యర్థులను, మహిళలని కూడా చూడకుండా అరెస్టు చేసిన యువతులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.










# దారిద్ర్య నిర్మూలనలో పాలకుల వైఫల్యాలు

## నేడు అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం




పేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' ప్రతి ఏటా అక్టోబర్ 17న నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్య సమితి 1990 అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది. **హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. పేదరికం** ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని "పేదలు" అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవకాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి". ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు "పేదలకు బాగానే అందుతున్నాయి. కానీ, నిరుపేదలకు అందడం లేదు". కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్ర్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది.101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు 1.90 డాలర్లు (దాదాపు రూ.135) లేదా అంతకంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సాను కూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం, వయసు, లింగం వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ద్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన.

2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడి పోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచం లోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరి కానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపు కొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం.

అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్పదష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించ గలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు. పైగా పని పరిస్థితులు దుర్భరం. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న దృష్ట్యా సంఘటిత రంగ కార్మికులు సరికొత్త ఉద్యోగాల్లో మహిళల వాటా సైతం పెరగాలి. ఇతర దేశాల్లో 50 నుంచి శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత దేశంలో వారి సంఖ్య కేవలం 24 శాతం. స్థూలంగా చూస్తే భారత్, చైనాలు రెండింటిలో అసమానత ఒకేరకంగా ఉన్నట్లు కనిపించినా భారతీయ పేదలు కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో ఉన్నారు. విద్య, వైద్యం, ఇతర సేవలూ సరిగ్గా అందడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా రైతులకు ఇప్పటికీ గిట్టుబాటు ధరలను అందించలేక పోవడం విచారకరం. అనావృష్టి పీడిత ప్రతి పౌరుడికి కొంత ఆదాయం అందించడానికి కనీస ఆదాయ పథకం పెట్టాలని ప్రపంచ మంతటా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ పథకాన్ని మొదట వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేయవచ్చు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న వృద్ధులకు దీనివల్ల ఎంతో ఊరట కలుగుతుంది. తరవాత మిగతా లబ్ధిదారులకు క్రమంగా ఈ పథకాన్ని వర్తింప జేయవచ్చు. అనారోగ్యం ఉపాధి కోల్పోవడం, పంట నష్టం వంటి అనూహ్య విపత్తులతో అతలా కుతలమయ్యే పేదలకు కనీసాదాయ పథకం ఎంతో కొంత ఆసరా ఇస్తుంది. అదే సమయంలో పేదలకు సరైన ఉపాధి కల్పించడం ఎంతో ముఖ్యం.



వైద్యుడు, స్వాతంత్ర్య సమర యోధుడు

# జీఎస్ మేల్కోటే

జి.ఎస్.మేల్కోటే గా ప్రసిద్ధిచెందిన గోపాలయ్య సుబ్బుకృష్ణ మేల్కోటే సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, వైద్యుడు, పరిపాలనా దక్షుడు. ఆయన సుబ్బుకృష్ణ దంపతులకు ఒడిషా రాష్ట్రంలోని బరంపురంలో 1901 అక్టోబరు 17 విజయ దశమి రోజున జన్మించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్.ఎం.ఎస్ పరీక్షలో 1927లో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడై బంగారు పతకం అందుకున్నాడు. దేశీయ వైద్య విధానాన్ని, యోగాసనాల ప్రభావాన్ని జోడించి ఉత్తమ వైద్యులుగా ఖ్యాతి పొందాడు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరాబాదు అధ్యక్షుడిగా పనిచేశాడు. ఈయన పతంజలి యోగ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించాడు. స్వతంత్ర భారతదేశంలో ఆయన ఎన్నో బాధ్యతాయుత పదవులు నిర్వహించాడు. హైదరాబాదు శాసనసభలో 1952 నుండి 1956 వరకు సభ్యులై మొదట ప్రజా పనుల శాఖలో తర్వాత ఆర్థిక శాఖలో మంత్రి పదవి నిర్వర్తించాడు. ఆయన ముషీరాబాదు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో రాయచూరు లోకసభ నియోజకవర్గం నుండి తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. 1962 నుండి 1977 వరకు భారత పార్లమెంటు సభ్యుడిగా హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. భారత ప్రభుత్వ ప్రతినిధిగా ఆగ్నేయాసియా ప్రాంతీయ ప్రపంచారోగ్య వ్యవస్థా మహాసభ, కామన్ వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ లలో పాల్గొన్నాడు. హైదరాబాదు లోని ఐ.ఎన్.టి.యు.సి. శాఖకు అధ్యక్షులుగా కొంతకాలం పనిచేశాడు. ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. 1916లో స్వదేశీ ఉద్యమంలో మొదటి సారిగా పాల్గొన్నాడు. ఉప్పు సత్యాగ్రహంలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వద్ద, కర్ణాటక రాష్ట్రంలోనూ ఉప్పు తయారుచేసి పోలీసులచే నిర్బంధితుడై హింసలకు గురయ్యాడు. కరాచీ కాంగ్రెస్ లో హైదరాబాదు ప్రతినిధిగా 1931 లో పాల్గొన్నాడు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ సభ్యుడై 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947, ఆగస్టు 15 న భారత జాతీయ పతాకాన్ని హైదరాబాదులో ఎగుర వేయడానికి ప్రయత్నించగా నిజాం ప్రభుత్వం జైల్లో పెట్టింది. పోలీసు చర్య అనంతరం విడుదలయ్యాడు. ఆయన సతీమణి విమలాబాయి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. వీరి మాతృభాష కన్నడం అయినా వీరు ఆంధ్ర దేశానికి చేసిన సేవ గణనీయం. మెల్కోటే 1982 మార్చి 10 వ తేదీన పరమ పదించాడు.

# అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్

**పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబుల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీపరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్ధత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు.**

## నేడు షోయబ్ ఉల్లాఖాన్ జయంతి



షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్లేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండితనాన్ని ప్రదర్శించాడు.

తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగవంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం.

ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుండి షోయబుల్లా ఖాన్ బయటకొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు.

మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది.

నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదనుకున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది. బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలకవర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు.

ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు. కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ధపడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగంగానే హెచ్చరించాడు. 1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకోబోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచిగానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# భక్తి గీతాల ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమే లక్ష్యం



**విశ్వంభర, బషీర్‌బాగ్:** నవరాత్రిని పురస్కరించుకొని శ్రేయ మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు భక్తి గీతాలను విడుదల చేశారు. అవి.. 'మైయా కా గుంగాన్ కరో', 'తేరే దార్ కా పూజారి జగదాంబే'. ఈ గీతాలతో పాటు ఉద్యోగులు, వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య బీమా పథకాన్ని కూడా ప్రారంభించారు. 'మైయా కా గుం గణ్ కరో' గోలూ డీ ఆలపించారు. ముకేష్ రాజ్ లిరిక్స్ రాశారు. హిమాంశు కుమార్ దీపక్ సంగీతం అందించారు. పంచీ జలోన్‌వి దర్శకత్వం వహించారు. 'తేరే దర్ కా పూజారి జగదంబే' సుర్భీ సింగ్ ఆలపించారు. హిమాంశు కుమార్ దీపక్ లిరిక్స్, సంగీతం అందించారు. పంచీ జలోన్‌వి దర్శకత్వం వహించారు. సంగీత రాయ్ నిర్మాతగా, శ్రేయ రాయ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలుగా డీ తాత్యా, పీ మహేశ్వర్ ఉన్నారు. ఈ సందర్భంగా శ్రేయ మ్యూజిక్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేటివ్ హెడ్ హేమంత్ కుమార్ రాయ్ మాట్లాడుతూ ఈ భక్తి గీతాల లక్ష్యం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమేనన్నారు. ఈ భక్తి గీతాలతో పాటు ఉద్యోగులు, వినియోగదారుల కోసం 'శ్రేయ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్' పేరుతో ప్రత్యేక ఆరోగ్య బీమా కార్యక్రమాన్ని కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ పథకం కింద శ్రేయ గ్రూప్ ఉద్యోగులు రూ. మూడు లక్షల వరకు ఆరోగ్య కవరేజీని అందుకుంటారన్నారు. ఈ సంస్థలోని లీడర్స్ రూ. రెండు నుంచి పది లక్షల వరకు కవరేజీకి అర్హులన్నారు. శ్రేయ గ్రూప్ వినియోగదారులు రూ.రెండు నుంచి మూడు లక్షల మధ్య ఆరోగ్య బీమా కవరేజీ ప్రయోజనం పొందుతారన్నారు. దేశవ్యాప్తంగా ఇరవై వేలకు పైగా ఆసుపత్రులలో చికిత్సను అందించే భాగస్వామ్య బీమా కంపెనీ ద్వారా ఈ బీమా కవర్ చేయబడుతుందని తెలిపారు. శ్రేయ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లక్నోలోని టెలిబాగ్‌లో కొత్త కార్యాలయానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇది సామాజిక, వ్యాపార ప్రయత్నాలలో పెరుగుతున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలు సమాజానికి సేవ చేయడంలో ఉన్న అంకితభావానికి నిదర్శనం అన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

## రోడ్ల అభివృద్ధికి 20 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడి



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు నియోజక వర్గం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని, పటాన్ చేరు నియోజక వర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల 20 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చేరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి దామోదర రాజ నరసింహాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బుధవారం పటాన్ చేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిధులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చేరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు.




విశ్వంభర, హైద్రాబాద్ : మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్‌కి శ్రీమాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ చక్రవర్తి జన్మదిన శభాకాంక్షలు తెలియజేసారు.

# పాతబస్తీ మున్నూరు కాపు సంఘం దసరా సమ్మేళనం



**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ ఉప్పు గూడ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఎస్కెవి బంకేట్ ఫంక్షన్ హాల్లో దసరా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ కమిషనర్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ రెడ్డి, సంతోష్ నగర్ డిప్యూటీ కమిషనర్ శైలజ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ దసరా సమ్మేళనం సందర్భంగా చెడుపై మంచి విజయం సాధించే విధంగా ఐక్యంగా ఉండి ముందుకు వెళ్లాలని అన్నారు. రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ పుప్పాల రవీందర్ కుమార్, అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, ఉపాధ్యక్షులు దేవరశటి ప్రభాకర్, చంద్ర కుమారి. శ్రీధర్, చంద్రకుమార్, బిట్ల అనుసరజ్, శ్రీధర్, మామిడి నర్సింగ్ రావు, ఉప్పుగూడ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీ సభ్యత్వ నమోదును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్ గౌడ్




**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయిందని, కాంగ్రెస్ పార్టీ పైన ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీనే అధికారంలోకి రాబోతుంది ఆయన తెలిపారు.. మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రతి క్రియాశీల కార్యకర్త 100 సభ్యత్వాలు చేయించాలన్నారు.. భవిష్యత్తులో పార్టీ బాధ్యతలు స్వీకరించాలన్నా ప్రజాప్రతినిధిగా పార్టీ బీ ఫామ్ పొందాలన్న సొంత ఐడి లింకు పైన వంద సభ్యత్వాలు చేయాల్సిందే ప్రజలలోకి వెళ్ళండి ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరిని భారతీయ జనతా పార్టీ కుటుంబంలో చేర్చండని ఆయన పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాలు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు, మాజీ సర్పంచ్ కాసోజు బ్రహ్మచారి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల నగేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడ్డటి మధు, ఓబీసీ జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ జాంగీర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం యాదవ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్ గౌడ్, రాజు, నీల కార్తీక్, గంగిళి వెంకటయ్య, పాలకూర్ల రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, సంగారెడ్డి :** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 56 లక్షల రూపాయల విలువైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, నరేందర్ రెడ్డి, తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్స్ పంపిణీ



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం కులస్తుల కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిడ్స్‌ను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది గౌడ కార్మికులు తాటి చెట్టు ఎక్కే క్రమంలో వారి యొక్క ప్రాణాలను కోల్పోతున్నారని అదేవిధంగా కుటుంబానికి భారంగా మారుతున్నవేళ ఎన్నో సార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్న పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గౌడ కార్మికులకు 13,000 వేల రూపాయల విలుగల కిట్స్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టితో గీత కార్మికులకు ఆపన్న హస్తంగా వారి యొక్క రక్షనే అధ్యయంగా గౌడ సంఘం కల్లుగీత కార్మికులకు 104 మందికి ఈ యొక్క సేఫ్టీ కీట్స్ ను పంపిణీ చేయడం అనేది చాలా హర్షనీయకరమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ అధ్యక్షులు మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు వివిధ మండలాల అధ్యక్షులు లబ్ధిదారులు గౌడ సంఘ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

## స్టడీ సర్కిల్, గ్రంథాలయ సంస్థలకు మంత్రి కోమటిరెడ్డి దాతృత్వం

### పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతీ యువకులకు చేయూత



**విశ్వంభర, నల్గొండ :** విద్యార్థులు కష్టపడి చదివి ఏపీజే అబ్దుల్ కలామ్ లాగ ఉన్నత స్థానానికి చేరుకోవాలి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా పరిషత్ స్టడీ సర్కిల్‌లో చదువుకుంటూ కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కోరిక మేరకు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తరపున ఒక లక్ష ఇరవై అయిదు వేల రూపాయల ఖరీదు చేసేటువంటి పుస్తకాలని బుధవారం నల్గొండలో తన క్యాంపు కార్యాలయ ఆవరణంలో జెడ్పి స్టడీ సర్కిల్ , గ్రంథాలయ సంస్థకు అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా జెడ్పి సీఈఓ నంద్యాల ప్రేమ్ కరణ్ కుమార్ రెడ్డి, స్థానిక గ్రంథాలయ లైబ్రేరియన్ బాలెమ్మా లకు మంత్రి సూచించారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను అందచేసిన మంత్రికి జెడ్పి సీఈఓ, గ్రంథాలయ లైబ్రేరియన్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కొలనుపాక రవికుమార్, లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం



**విశ్వంభర, అంబర్పేట్:** అలీ కేఫ్ చౌరస్తాలోని, జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు రావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ కుల గణన ద్వారా బీసీ ,ఎస్సీ, ఎస్టీ ,మరియు మైనారిటీ వర్గాల వారందరికీ సమన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం బీసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కెనడా ఆరోపణలపై స్పందించిన భారత్

## ఆరుగురు దౌత్యవేత్తల బహిష్కరణ

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఇటీవలి ఆరోపణలకు ధీటుగా స్పందించిన భారత్ ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించింది. జూన్ 2023లో ఖలిస్తాన్ మద్దతుదారు హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారత దౌత్యవేత్తలకు సంబంధం ఉందని కెనడా ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందని ప్రకటించింది. కెనడాలోని హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ ఇతర దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించాలని కూడా భారత్ నిర్ణయించింది. ఈ నిర్ణయాత్మక చర్య కెనడా ఇటీవలి దౌత్య సంభా షణను తిరస్కరిస్తుందనీ, ఇది భారతీయ దౌత్యవేత్తలపై నిరాధార ఆరోపణలు చేసిందనీ పేర్కొంది. నిజ్జర్ హత్యలో వారి ప్రమేయం ఉందని ఆరోపించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తాత్కాలిక హైకమిషనర్ స్టీవర్ట్ రాస్ వీలర్‌తో సహా ఆరుగురు కెనడియన్ దౌత్యవేత్త లను రాత్రి 11:59 గంటలకు భారతదేశం విడిచిపెట్టాలని ఆదేశించింది. అక్టోబర్ 19న దీనికి ముందు, భారత ప్రభుత్వం ఢిల్లీలోని కెనడియన్ హైకమిషన్ ను పిలిపించి, "కెనడాలోని భారత హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలపై నిరాధారమైన లక్ష్యం పూర్తిగా ఆమోదయోగ్యం కాదు" అని పేర్కొంది. "ట్రూడో ప్రభుత్వ చర్యలు తీవ్రవాదం, హింస అస్థిర వాతావరణంలో తమ దౌత్యవేతల భద్రతకు భంగం కలిగించాయనీ పేర్కొంది.

# విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలి

### చిలుక ఉపేందర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. చైతన్య పురి పోలీస్ స్టేషన్‌లో నూతన ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ రావుని మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో చిలుక ఉపేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థ ఫ్రెండ్లీ పోలి సింగ్‌గా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, శేషి, శ్రవణ్, అశోక్, విప్లవ్,కిట్టు, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు చేసుకోవాలి



**విశ్వంభర, కోరుట్ల:** ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హత కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. బుధవారం స్థానిక విలేకరులకు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల సెప్టెంబర్ 30 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుందని, ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. https://ceotelangana.nic.in/ వెబ్ సైట్ లోకి వెళ్లి ఆసక్తి గల ఓటర్లు ప్రాసెస్ పూర్తి చేసుకోవచ్చన్నారు. https://ceotserms2 .telangana. gov.in/mlc/form18. aspx పై నొక్కితే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. 2024 నవంబర్ 6వ తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.


# పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో చదివే చాలా బీద బాలికలను ఎంపిక చేసి, వారికి తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం, హంస ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, తెలంగాణ ఉద్యమ నేత, హంస ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.కే.చాంద్ అందజేశారు. ఎస్.కే చాంద్ మాట్లాడుతూ, ఇష్టంతో చదివితే ఎంత కష్టంగా ఉన్నా చదువు వస్తుందని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని కొనియాడారు. బీద విద్యార్థులను గుర్తించి, వారికి ఆర్థిక సహాయం చేయాలని దాతలను కోరారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే బాలు నాయక్



**విశ్వంభర, చింతపల్లి:** మండల కేంద్రంలోని శ్రీ శివ సాయి కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువాతో మార్కెట్ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు సైతం 500 రూపాయల బోనస్ గా ఇస్తుందన్నారు. కనీసం మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రం చెయ్యని విధంగా మూడు దఫాలుగా రైతులకు సుమారు లక్ష రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతుల దారుణ హత్య



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం కొత్తగూడలో ఓ వ్యవసాయ క్షేత్రంలో వృధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు మృతులు నాగర్ కర్నూల్ జిల్లా ముష్టిపల్లికి చెందిన దంపతులు ఉషయ్య (70) శాంతమ్మ (65)లుగా గుర్తించారు. ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యానారాయణ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. వారి హత్యకు పాత కక్షలు ప్రధాన కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మృతులకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

# తాటి, ఈత, ఖర్జూర చెట్లను నరికితే కఠిన చర్యలు




**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కడ్తల్, మాడు గుల, తలకొండపల్లి, ఆమనగల్ మండలాల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఈత, తాటి చెట్లను నరికిన, గెలలు నరికిన వారిపై ఎక్సైజ్ అక్ట్ ప్రకారం చర్యలు తీసుకోబడతాయనీ సీఐ బైద్యనాథ్ చౌహాన్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ తాటి చెట్లు, ఈత చెట్లు వెంచర్లల్లో తొలగించిన ఎవరైనా చూస్తే వెంటనే ఫోటోలు వీడియోలు తీసి స్టేషన్ నెంబర్ 8712658742, 9000571671లకు పంపించాలని, అన్ని మండలాల్లో గీత కార్మికులకు, వ్యవసాదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ విషయంపై అవగాహన కల్పించామని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు మరియు చట్ట వ్యతిరేకంగా వ్యవహరించి తాటి, ఈత ఖర్జూర వనాలను తొలగించిన తాటి చెట్ల గెలలను కోసిన ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, అదే విధంగా గీత కార్మికులు ఎవరు గాని తాటి, ఈత కల్లులో మత్తు పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హాని కల్పించే విధంగా వ్యవహరిస్తే వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

# గ్రామ దేవతల పున: ప్రతిష్టాపన



**విశ్వంభర,నందిగామ:** మండల కేంద్రంలో బుధవారం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ఆధ్వర్యంలో గ్రామ దేవతల పునర్ ప్రతిష్టాపన కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ శాసనసభ్యులు అంజయ్య యాదవ్, మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు. టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, చేగుర్ పిఎసిఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విట్టల్, నందిగామ సింగల్ విండో వైస్ చైర్మన్ రజనీకాంత్ యాదవ్, కొత్తూర్ మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దేశాల జైపాల్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ మల్లు రవిని కలిసిన ఆశాదీప్‌రెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన రాష్ట్ర యువజన సంఘం నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని మర్యాద పూర్వకంగా హైదరాబాదులోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఆయన నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. వెంటనే మల్లు రవి స్పందించి అన్ని రకాలుగా కల్వకుర్తి నియోజకవర్గానికి సాయం చేసి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. త్వరలో నియోజకవర్గంలో పర్యటిస్తానని ఈ సందర్భంగా ఆశాదీప్ రెడ్డికి ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

# సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) సీపీఎం మండల 8వ మహాసభ ఈ నెల 19 అక్టోబర్ 2024 శనివారం ఎంఎస్ఆర్ గాడెన్స్ లో నిర్వహిస్తున్నామని మండల కార్యదర్శి వేముల భిక్షం తెలిపారు. వేముల భిక్షం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం జరిగిన మహాసభ నుండి నేటి వరకు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆత్మకూరు(ఎం)మండలంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం సీపీఎం అనేక క్రియాశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజల వ్యక్తిగత సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అనేకసార్లు మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రజలను సమీకరించి అనేక పోరాటాలు సీపీఎం నిర్వహించిందని అన్నారు. ఈ ప్రాంతంలో త్రాగు నీరు, సాగు నీరు అవసరాలు తీరే పరిస్థితి లేదని, అందువల్ల బస్వాపురం రిజర్వాయర్ నుంచి బునాదిగాని కాలువ పూర్తి చేసి గోదావరి నీళ్ళు అందించలని, అదే విధంగా బిమలింగం కాల్వకు మూసీ నీళ్ళ బదులు గోదావరి నీళ్ళు అందించాలని, ఈ ప్రాంత యువతకు ఉపాధి కొరకు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేయాలని ఈ మహాసభ సందర్భంగా సీపీఎం డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిలు సీపీఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎండీ జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కల్లూరి మల్లేశం హాజరవుతున్నారని అన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రచ్చ గోవర్దన్, టౌన్ కార్యదర్శి రాచమల్లు సత్తయ్య, తిమ్మాపురం గ్రామశాఖ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి, కందడి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ



**విశ్వంభర, హైద్రాబాద్:** ప్రభుత్వం నిధుల విడుదలతో గ్రామీణ రహదారులకు మహర్దశ అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, ఉండెల బాబూరావు, ఏకుల మహేందర్ కురుమ, మండలఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సభావట్ గణేష్ నాయక్ అన్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 91 నియోజకవర్గాలలో 641 పనులు చేపట్టడానికి 1323 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణం కోసం 1377 కోట్ల రూపాయలు కేటాయింపులో మహేశ్వరం నియోజకవర్గ గ్రామీన రోడ్ల విస్తరణకు మాజీ శాసన సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కెఎల్ అర్ గారి కృషి వల్ల 17 కోట్ల రూపాయలు కేటాయించిందం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, కెఎల్ ఆర్ గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించేలా ప్రభుత్వ పెద్దలను కలిసి గతంలో వినతిపత్రాలతో పాటు, ప్రతిపాదనలు అందజేశారు. ఫోర్త్ సిటీ, ఫార్మా, మెట్రో కారిడార్, హెల్త్, ఎడ్యుకేషన్ హాబ్‌లతో మహేశ్వరం నియోజకవర్గం మహానగరంగా మారుతున్న తరుణంలో రోడ్ల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేయటం హర్షనీయమని వారు తెలిపారు. ఇప్పటికే ఫాక్స్ కాన్ లాంటి అంతర్జాతీయ కంపెనీలతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తుందని వారు తెలిపారు.

## నిరుత్సాహ పడకుండా ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు



**విశ్వంభర, మేడిపల్లి:** యువత ఒక ఉద్యోగం కొరకు ప్రయత్నించి అది రాలేదు అని నిరుత్సాహ పడకుండా మరో కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయితే కచ్చితంగా ఉద్యోగం సాధిస్తారు అని రాచకొండ రన్నర్స్ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు. రాచకొండ రన్నర్స్ ప్రభాకర్ ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకున్న హర్షవర్దన్ రెడ్డి కి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం రావడం తో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల శాంతివనం పార్కులో ఆయనను కుటుంబసభ్యులతో కలిసి సన్మానించారు. హర్షవర్ధన్ రెడ్డి తనకు ఎస్సై ఉద్యోగం రాలేదు అని నిరుత్సాహ పడకుండా మరో ప్రయత్నంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం సాధించడం చాలా గర్వకారణం. త్వరలో జరిగే గ్రూప్-1 పరీక్షలలో కూడా ఉత్తీర్ణత సాధించి గ్రూప్ వన్ ఆఫీసర్ కావాలని, హర్షవర్ధన్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాచకొండ రన్నర్ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ విజయానికి కారణం అయినటువంటి మా కుటుంబ సభ్యులకు,రాచకొండ రన్నర్స్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఓయూ జేఏసీ నాయకులు కట్ట శేఖర్, బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థి నాయకుడు నరసింహ నాయక్, పోచారం ఎస్సై నాగార్జున రెడ్డి, హర్ష వర్ధన్ కుటుంబసభ్యులు భార్యవర్షిని భాను, మామ చంద్రబాను, రాచకొండ రన్నర్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ

## పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.రాజారాం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో గల పెద్ద చెరువు చెన్నారాయి చెరువులో 95వేల చేప పిల్లలను వదిలారు. దీనిలో భాగంగా జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేప పిల్లల పెంపకంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ తండా మంగమ్మ శ్రీశైలం గౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా, తాజా మాజీ ఎంపీటీసీ మల్లా రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి ఎల్మినేటి లోకేశ్వర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ఇంజ నరేష్, ఏఈఓ సరిత, ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సుంకరి శ్రీనివాస్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ఏగు మల్లేష్, కారోబార్ నోముల స్వామి, పీల్డ్ అసిస్టెంట్ గుర్రం సురేష్, మత్స్యశాఖ అధికారులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యాట వెంకటేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

# ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే




**విశ్వంభర, మహబూబాబాద్:** గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయాలని, పల్లెల నుండి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ జిల్లా కేంద్రం చేరుకుంది, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో , రెవెన్యూ, డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, స్వాగతం పలికి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించబోతున్న సీఎం కప్ 2024 పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కల్పించే ఉద్దేశంతో ఈ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం కప్ నోడల్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ కన్నం మధు, జిల్లా స్పోర్ట్స్ అధికారి అనిల్, గోకుల్, రతన్ కుమార్ బోస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్, జిల్లా అధికారులు కలెక్టరేట్లోని అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు,

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేప భాస్కర్ రెడ్డి




**విశ్వంభర, మహేశ్వరం:** రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు వేముల రేణుక కుమార్తె ఐశ్వర్య, అరుణ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను రామకృష్ణాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పురం డివిజన్ పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ గడ్డి అన్నారం డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, తాలటి రమేష్ నేత, గట్ల రవీందర్, సురేష్, ఎన్ ఎస్ యు ఎల్ శివ, సైదులు, శ్రీకాంత్ రెడ్డి, దినేష్ సింగ్, విప్లవ రెడ్డి రామకృష్ణ పురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సుజాత రెడ్డి, మాధవి, స్వరూప, కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీ ఎంబుర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు వెంటనే విడుదల చేయాలనీ తెలంగాణ (కాకతీయ )ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియే షన్ (టీ పీ సియల్ఎ)రాష్ట్ర అధ్యక్షుడు సంకె పల్లి శ్రీని వాస రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సాయిదత్త ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహబూబాబాద్ పట్టణ కమిటీ అధ్యక్షుడు బానోత్ మంగీలాల్ అధ్యక్షతన జరిగిన సమావేశములో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సంకె పల్లి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగిస్తూ గత ప్రభుత్వము మూడు సంవంత్సరంలుగా కొన్ని వందల కోట్ల ఫీజు రెంబుర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించనందువలన ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాల లు తీవ్ర ఆర్థిక సంక్షోభము నకు గురి అయి కళాశాలాల నిర్వహణ బహుళ సమస్యగా మారిందని అన్నారు.రాష్ట్ర కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు సుధారాణి, కిషన్,శివ, రాజి రెడ్డి, వీరన్న, ప్రసాద్ , పావని, రజిత, రమ్య,పాల్గొన్నారు.

# ఆస్పత్రులలో ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, మహబూబాబాద్ :** పట్టణంలోని ఆసుపత్రులలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన వారి వివరాలు, స్కానింగ్ నిర్వహించిన వారి వివరాలు, పూర్తి ఇంటి పేరు, ఇంటి నెంబర్ చిరునామా, మొబైల్ నెంబర్, ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫామ్-ఎఫ్ రికార్డులు సక్ర మంగా ఉండాలని ప్రతి నెల 5 వ తేదీ లోపల జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంనకు ఖచ్చి తంగా పంపించాలని ఆయన పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయకూడదని, ఎంటి పి నియ మాలకు, వ్యతిరేకంగా అబార్షన్ లు చేయకూడదని అలాగే సాధారణ ప్రసవాల రేటు పెంచాలని ఆయన అన్నారు. ఆసుపత్రులలో పిల్లల మరణాలు, మాతృ మరణాలు సంభవించి నట్లైతే వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి సాదారణ ప్రసవం గూర్చి ముందు నుండే సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ తనిఖీ లో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులకు స్వాగతం



**విశ్వంభర, భూపాలపల్లి:** డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల శాఖ పక్షాన నూతన డిఎస్సి 24 లో ఎంపిక చేసి మహాదేవపూర్ మండలం లోని ఉపాధ్యాయ ఖాళీలలో మొత్తం నింపిన జిల్లా విద్యా శాఖకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మహాదేవపూర్ మండల శాఖ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. డీటీఫ్ జిల్లా ప్రతినిధ్యం వల్ల మహాదేవపూర్, పలిమెల, మహా ముత్తారం, కాటారం మరియు మలహర్ రావు మండలాలలో ఉన్న అన్ని ఖాళీలు నింపి మారుమూల మండలాల విద్యా పురోగతికి సహకరించిన తెలంగాణా ప్రభుత్వానికి మరియు జిల్లా అధికారులకు %ఖఖీ% మహాదేవపూర్ మండల శాఖ, జిల్లా శాఖ ఎల్లవేళలా కృతజ్ఞతలు అందిస్తుందని జోనల్ భాద్యులు బొమ్మన తిరుపతి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం మండల శాఖ ఆధ్వర్యంలో మద్క మధు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉర్దూ హెచ్ ఎం ప్రకాష్ బాబు, శ్రీనివాస్, వీరేశం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఐ సోలోమన్ రాజును సన్మానించిన జర్నలిస్టులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సోలోమన్ రాజుని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐమాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పాత్రికేయ మిత్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన జర్నలిస్టులు వారధిగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్ కృష్ణయ్య, ఏఎస్సై పి సైదులు, పోలీస్ సిబ్బంది, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు గడ్డం నాగరాజు, ఉపాధ్యక్షుడు షేక్ అజీజ్, గౌరవాధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్, కార్యదర్శి పొనగాని సతీష్, మహిళా కన్వీనర్ దంతూరి సుమలత పాల్గొన్నారు.

# యువజన సంఘాల దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, భూపాలపల్లి:** నెహ్రూ యువ కేంద్ర వరంగల్(ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘం లోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల అనగా అక్టోబర్ 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870- 2958776 సంప్రదించాలని ఆయన కోరారు.

# మృతదేహంతో ధర్నా



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** భద్రాచలంలోని తెలంగాణ టూరిజం హోటల్ ముందు దళిత సంఘాల నాయకులు కార్యకర్తలు మృతదేహంతో ధర్నా చేపట్టారు. తెలంగాణ టూరిజం హరిత హోటల్లో అవుట్సోరింగ్ వర్కర్‌గా పనిచేసిన ఈసంపల్లి నరసింహారావు (40) మనస్థాపం చెంది గుండెపోటుతో మృతి చెందాడు. గతంలో పది సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ వర్కర్ గా పనిచేసిన నరసింహారావును మేనేజర్ నాగలక్ష్మి డ్యూటీలో నుంచి తీసివేసి, మళ్లీ తీసుకోకపోవడంతో మూడు నెలలుగా తిరుగుతూ మనస్థాపం చెంది మృతి చెందాడు. ఎలాంటి ఆరోపణలు లేకుండా హోటల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను యాజమాన్యానికి తెలిపినందుకు తనను డ్యూటీలో తీసివేశారని, ఉన్నత స్థాయి అధికారులు డ్యూటీలోకి తీసుకోమని చెప్పినప్పటికీ మేనేజర్ నాగలక్ష్మి డ్యూటీ కి తీసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారని అందువల్లనే మనస్తాపం చెంది తన భర్త మృతి చెందాడని నరసింహారావు భార్య వెల్లడించింది. మృతుడి కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు దళిత సంఘాల నాయకులు కార్యకర్తలు టూరిజం హోటల్ ముందు ధర్నా చేపట్టారు. వారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్నారు..

# భద్రాచలం ఎమ్మెల్యేని కలిసిన పెన్షనర్స్




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావుని భద్రాచలం డివిజన్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చల్ల గుళ్ళ నాగేశ్వరరావు, కేఎస్ ఎల్వి ప్రసాద్, డికృష్ణమూర్తి, సుబ్బయ్య చౌదరి, రాజబాబు, శివప్రసాద్, ఐలయ్య, రాజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి పెన్షనర్స్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మీ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి మీకు తప్పనిసరిగా స్థలాన్ని కేటాయిస్తానని భవన నిర్మాణానికి కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు. భోగాల శ్రీనివాసరెడ్డి, కొండిశెట్టి కృష్ణమూర్తి, వెంకటరెడ్డి, ఎండి నవాబ్, రత్నం రమాకాంత్. తిరుపతిరావు. రమేష్ గౌడ్ బొంబోతుల రాజీవ్, నాయకులు పాల్గొన్నారు.

## విద్య పట్ల శ్రద్ధ కనబరిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు



**విశ్వంభర, కల్వకుర్తి:** యూత్‌ఫర్‌సేవా ఆధ్వర్యంలో ఇందిరా నగర్‌లో పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ , బుక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశలో విద్య పట్ల శ్రద్ధతో పట్టుదలతో చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. సిఐ నాగార్జున, ఎస్సై మాధవ రెడ్డి, చంద్ర శేఖర్ అతిథులుగా పాల్గొన్నారు.

## మూసీ నిర్వాసితుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం



**విశ్వంభర, హైదరాబాద్:** మూసి ప్రక్షాళనలో భాగంగా ఇల్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం కల్పించారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగానికి చెందిన పీ.ఓలు, ఆర్.పీల కృషితో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశా లలో ఎలాంటి ఎంట్రన్స్ పరీక్ష లేకుండా ప్రవేశం కల్పించారు. విద్యార్థులు మాధవి 7వ తరగతి, శిరీష 8వ తరగతి, తేజస్వీ 5వ తరగతిలో ప్రవేశం పొందారు. సరూర్ నగర్ తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్‌లో వీరికి ప్రవేశం కల్పించారు. యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణ రెసిడెన్షి యల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ప్రశాంతితో మాట్లాడి ఎలాంటి ఎంట్రన్స్ లేకుండా విద్యార్థులు ఉచిత విద్య పొందేలా అడ్మిషన్ చేయించారు.

## రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రెడ్డి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రైతు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుందని దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పండించిన ప్రతి చివరి గింజల వరకు కొనుగోలు చేస్తామని అన్నారు రైతు పండించిన ప్రతి పంట కు గిట్టుబాటు ధరను అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మదు సుదన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,నారా గౌడ్, పెరుమల్ గౌడ్, కుంట్లా రాములు, కుంట్ల సాయిలు, సత్యనారాయణ, సంతు సెట్, సాయి రెడ్డి, గోవింద్ రావు, రఘుపతి రెడ్డి, తదితర గ్రామ మండల నాయకులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేయాలి

**విశ్వంభర,పెద్ద శంకరంపేట:** విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలనీ పెద్ద శంకరంపేట మండల విద్యాధికారి డి వెంకటేశం అన్నారు. బుధవారం మండల వనరుల కేంద్రంలో మండలానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి వారికి పాఠశాలలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి తెలుపుతుందని అందులో భాగంగానే పాఠశాలల బలోపేతానికి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తూ విద్యార్థుల భవితవ్యం కాపాడడానికి ఉపాధ్యాయులను కూడా నియమించిందని అన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందచేసిన ఎంఈఓ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో నూతనంగా నియామకం కాబడిన ఉపాధ్యాయులకు విధులలో చేరుటకు మండల విద్యాధికారి కొత్త మహాదేవరెడ్డి ఉత్తర్వులు అందజేశారు. డీఎస్సీ2024 ద్వారా నియమకమైన 21 మంది ఉపాధ్యాయులలో లాంగ్వేజ్ పండితుడు పోస్ట్ 01, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్ట్ 01, స్కూల్ అసిస్టెంట్లు తెలుగు పోస్ట్ 01, బయాలాజీకల్ సైన్స్ 01, సోషల్ 03, ఇంగ్లీషు 01, ఎస్జీటి పోస్టులు 13, మొత్తం మండలలలో 21 మంది విధుల్లో చేరటం జరిగిందని పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఎంఈఓ తెలిపారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య



విశ్వంభర, ఆత్మ కూరు (ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో మెరుగు కృష్ణ చిన్న కుమారుడు మెరుగు నరేష్ (19) ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# అధునాతన సాంకేతికత కలిగిన ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ బైక్స్ ప్రారంభం

## ప్రారంభించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**విశ్వంభర, సంగారెడ్డి:** సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ ఎస్ ఎస్ సీ), గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి, అత్యవసర సమయంలో త్వరితగతిన స్పందించడానికి అధునాతన సాంకేతికత కలిగిన 10 ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ బైక్ లను బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఏస్పీ రూపేష్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ప్రజల రక్షణ, పరిశ్రమల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ, పరిశ్రమల సమన్వయంతో సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సొసైటీ ద్వారా పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రత కొరకు న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో గత నెలలో "షీ-షటల్" బస్సును ప్రారంభించడం జరిగిందన్నారు. మైగ్రేట్ లేబర్స్ పిల్లలకు, శారీరక అంగవైకల్యం ఉన్న వారికి ప్రత్యేక విధానం ద్వారా విద్యను అందిస్తామన్నారు. జిల్లాలో ప్రధాన పట్టణాలలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ బైక్ లను ప్రారంభించడం జరిగిందని, ఈ బైక్ లలో సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం జరుగుతుందని ఆయన అన్నారు. అత్యవసర సమయంలో సమాచారం అందిన వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించేందుకు వీలుగా ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంటుందని అన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ మరియు గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ బైక్ లను ప్రారంభించుకోవడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టి ఈ సొసైటీ ద్వారా జిల్లా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ బైక్స్ పటాన్ చేరు, సంగారెడ్డి, జహీరాబాద్ వంటి ప్రధాన పట్టణాలలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ట్రాఫిక్ సమస్యను నియంత్రించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మెన్, జిల్లా ఏస్పీని, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, గ్లాండ్ ఫార్మా మేనేజింగ్ ట్రస్ట్ రఘురమణ ను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, ఏస్ఏస్ఏస్సీ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ రమణారెడ్డి, ఏస్ ఏస్ ఏస్ సీ మెంబర్స్ ఆనంద్ రావ్, రమేష్, ఎ.వి. రావ్, రంజిత్ కిరణ్ ట్రాఫిక్ సీఐలు సుమన్, లాలూ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు



**విశ్వంభర, షాద్‌నగర్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ లను విడుదల చేయాలని కోరుతూ బుధవారం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెందిన యాజమా న్యాలు స్థానిక ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం అందించే సాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ వల్లనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూన్నామని, బకాయి ఉండటం వల్ల ప్రైవేట్ కళాశాలలో చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద మధ్యతరగతి విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.భవాని శంకర్, టీ. కర్ణాకర్, కే. రాఘవేందర్, సి. రజనీకాంత్, జే. వెంకట్ రెడ్డి, బీఏఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇ. నాగరాజు, మచ్చేందర్, మణివర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, రాజు ఉన్నారు.

## విద్యుత్ శాఖ నూతన ఏడికి సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువన గిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో నూతన ఏడిగా కట్ట శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా వచ్చిన ఏడి కట్ట శ్రీకాంత్ ను ఎస్సీ, ఎస్టీ చౌటుప్పల్ డివిజన్ కమిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షులు చింతపెల్లి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ముత్యాల బిక్షపతి, సహాయ కార్యదర్శి నరసింహ, జిల్లా నాయకులు లక్ష్మీ నరసింహ, రామన్నపేట సబ్ డివిజన్ లీడర్ దేశపాక అశోక్, రామన్నపేట సెక్షన్ లీడర్ కొమ్ము సైదులు, వలిగొండ సెక్షన్ లీడర్ అశోక్, శ్రీనివాస్, కిరణ్, ముత్యాల మహేష్, దేవేందర్, చిన్న పాక రమేష్, దేశపాక రమేష్ పాల్గొన్నారు.

## నక్షబాట రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట నుండి సర్దార్ నగర్ వెళ్లే నక్షబాట ప్రజలు నడవలేని పరిస్థితిలో ఉంది. ఈ రోడ్డు గుండానే సర్దార్ నగర్ సంత కు వాహనాలు, ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డును విస్తరించి బాగు చేయించాల్సిందిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కోరగా బుధవారం రోడ్డు విస్తరణ పనులను గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించడం జరిగింది. గ్రామ అధ్యక్షుడు బద్దుల మల్లయ్య, గున్న భీమయ్య, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీశైలం, నారం రాంరెడ్డి, భవానీ మాత దేవాలయ చైర్మన్ ముత్యాల రాజు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చాకలి చంద్రయ్య, ముదిగొండ సంజీవ, మాజీ వార్డు సభ్యుడు బుద్ద నర్సింలు, ఆర్ల యాదయ్య, సీమ మల్లయ్య, చౌడపురం భీమయ్య పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికై కోటి నిధులు మంజూరు



**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేయర్ అజయ్ యాదవ్ ను గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కలిసి కాలనీ అభివృద్ధికై నిధులు కేటాయించినందుకు మేయర్, డిప్యూటీ మేయర్‌లకు శాలువాతో సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ్ నగర్ అభివృద్ధికై మేయర్ అజయ్ యాదవ్ ఒక కోటి రూపాయలు మున్సిపల్ నిధులను మంజూరు చేశారని, కాలనీ లో ఉన్న ప్రధాన సమస్యలు రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ,మంచినీటి పైప్ లైన్ కొరకు నిధులను మంజూరు చేసి వారికి చేయూతనిచ్చిన మేయర్ కు గౌతమ్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నూతనంగా ఏర్పడిన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులను మేయర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాన గల్ల యాదగిరి, కొత్త కిషోర్ గౌడ్, గౌతమ్ నగర్ కమిటీ అధ్యక్షులు బి.సారయ్య, ఉపాధ్యక్షులు ఉపేంద్ర చారి, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, బిక్షపతి, ఎండి.గఫర్, వెంకటేష్, మహేష్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విలువైన వస్తువులు మాయం

## ,ట్రాక్టర్ ట్రాలీ, ఫాగింగ్ యంత్రాలు మాయం

## బాధ్యులు ఎవరో తెలిసినా చర్యలుకు జంకుతున్న అధికారులు



**విశ్వంభర, మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వింత పరిస్థితి నెలకొంది. విలువైన వస్తువులు మాయమవుతున్నా మాకెందుకు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఇక్కడి అధికారులు . ఫలితంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో విలువైన వస్తువులు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. ట్రాక్టర్ ఇంజన్లు కనబడకుండా పోవడంతో పాటు , ట్రాలీలయితే ఏకంగా వేరే జిల్లాలో దర్శనమవడం పెద్ద చర్చనీయంశంగా మారింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది చేతి వాటంతో ఏకంగా ట్రాక్టర్ ట్రాలీ మాయమై జిల్లాలు దాటించి అమ్ముకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య విభాగంలో దోమల ఫాగింగ్ యంత్రాల లెక్కలతో కూడా తేడా ఉందని సమాచారం! ... సిబ్బందికి అందించే సబ్బులు, నూనెలు వంటి చిన్న వస్తువులలో చేతివాటం ఎంతో? పెద్ద స్థాయిలో అధికారి అండ లేనిదే ఇది సాధ్యమ అని ప్రజల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఎవరు చేసారో తెలిసినా రికవరీ చేయని వైనం చర్యలు తీసుకోవటానికి జంకుతున్న కార్పొరేషన్ అధికారి, కారణం అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నియోజకవర్గ నాయకులేనా? మరెందుకు చర్యలు తీసుకోవడం లేదు. అడ్డుకుంటున్న నాయకులు ఎవరు? అసలు పాలక వర్గం, అధికారులు ఏం చేస్తున్నట్లు? అడ్మినిస్ట్రేషన్ పై అవగాహన లేక ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేయడంతో... పనుల్లో జాప్యం వల్ల ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ పాలక వర్గం పనుల, విధుల నిర్వహణపై దృష్టి పెట్టాలని, గతంలో ఇక్కడ పనిచేసిన సానిటేషన్ ఇన్స్పెక్టర్ బిల్లుల చెల్లింపులో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారుల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే అది పునరావృత్తం కాకుండా ప్రస్తుతం కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బాద్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ని కలసి డిమాండ్ చేసారు. డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు, బాలరాజు, వెంకట్, యసారం శ్రీనివాస్, జగన్ రెడ్డి, మల్లం వెంకటేష్, శివరాజు, నాయకులు అక్కల శ్రీను, నాగరాజు, తిరుమలేష్, సోమేశ్, మురళి, కిరణ్ నాయక్, రాధాకృష్ణ, సురేష్, బాలరెడ్డి, రమేష్, పాషా, నర్సయ్య, రామకృష్ణ, సురేందర్ రెడ్డి, అశోక్, సతీష్ బాబు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత



**విశ్వంభర, ఊరుకొండ:** ఊర్కొండ మండలం లోని గుండ్ల గుంటపల్లి గ్రామానికి చెందిన పర్వతం రాములమ్మ, రేవల్లి గ్రామానికి చెందిన వసంతాపురం నాగమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల ద్వారా చెరో రూ.5000/-అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, ఫరీద్, నాయకులు కొండపల్లి కొండల్, ఆనంద్, రంగయ్య, ఠాగూర్, ఎల్లయ్య, లక్ష్మయ్య, శాంతయ్య, వెంకటయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్టీయూసీ మండల శాఖ అధ్యక్షులుగా చెక్క నరసింహ



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు సంస్థాన్ నారాయణపురం ఐఎన్టీయూసీ మండల శాఖ అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన చెక్క నరసింహ ను నియమిస్తూ ఐఎన్టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ రామచందర్, నియోజకవర్గ అధ్యక్షులు ఎస్కే బడే సాబ్‌లు నియామక పత్రాన్ని చౌటుప్పల్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో అందజేశారు. చెక్క నరసింహ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఆల్ ఇండియా ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రగోని నాగన్న గౌడ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సుడుగు జీవన్ రెడ్డి కి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. నారాయణపురం గ్రామ మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలారం రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైకని నరేం దర్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ బోయిని నర్సింహ్మ, నాయకులు చెక్క విజయ్, చింతల లింగ స్వామి, అబ్బరగోని వంశీ, నూతి నర్సింహ్మ, చెక్క కిరణ్ కుమార్, ఏనుగు శివ పాల్గొన్నారు.

## గోపాలపురంలో ఎన్.ఎస్.ఆర్ హెల్త్ క్యాంప్




**విశ్వంభర, భూపాలపల్లి:** శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో అపోలో ఎన్ఎస్ఆర్ ఆసుపత్రి వైద్యుల బృందంతో హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. గ్రామంలో ప్రజలందరికి బీపీ, షుగర్, బ్లడ్ టెస్ట్, ఈసీజీ లాంటి ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్యాంపు ఇన్చార్జి సుమన్ రావు, చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్, నీలం మహేందర్, ఏకు స్వామి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన రజక యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గాలయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్, పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఏపూరి బాలరాజు, పున్నం యాదగిరి, ఏపూరి గోపాల్, రాచకొండ రమేష్ బాబు, ఉప్పల వెంకటేష్, ఉప్పల లక్ష్మణ్, లింగంపల్లి జంగయ్య, ఉప్పల నరసింహ, ఉప్పల శ్రీను, ఉప్పల నాగరాజు, అందె నరేష్ యాదవ్, లింగంపల్లి జంగయ్య, శీను, ఉప్పల లింగ స్వామి, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పంట పొలాలను కాపాడండి



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ 82 ప్యాకేజ్ నెంబర్ 29 కాల్వ ద్వారా నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దిగువ ప్రాంతానికి వెళ్లలేక రైతులు అక్కడక్కడ అడ్డుకట్టలు ఏర్పాటు చేయడంతో కే ఎల్ ఐ కాల్వ కట్ట తెగిపోయి నీళ్లు రైతుల పంట పొలాలలోకి నీళ్లు వస్తున్నాయని పోతపల్లి గ్రామస్తులు ఇరిగేషన్ డిఈ కి బుదవారం వినతి పత్రం అందజేశారు. గత 15 రోజుల కిందట మండల కేంద్రంలోని లచ్చపురం వద్ద కాల్వకు గండిపడి నీరంతా పంట పొలాల్లోకి వచ్చి చేరింది. పోతపల్లి గ్రామ శివారులో రైతుల పంట పొలాలలోకి నీళ్లతో పాటు, ఇసుకమేటలు వేసి పంట నష్టం జరిగిందని, అందుకని డీ 82 కాల్వకు మరమ్మత్తులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తగుల్ల కొండల్ యాదవ్,ఉడత శ్రీశైలం, ఉడుత శ్రీశైలం, ఉడత బాలస్వామి, ఉడుత శివ, ఉడుత శివ, ఉడుత మల్లేష్, జబ్బు ఎల్లయ్య, ఉడుత వీరయ్య, ఉడుత అమృతయ్య లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.హెచ్.ఆర్.సీ, ఎన్జీఓ మండల కమిటీ నియామకం

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ ఎన్‌హెచ్ ఆర్ సీ ఎన్జీవో మండల అధ్యక్షులుగా సుంకే మధు నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావు సూచనల మేరకు మండల అధ్యక్షుడు ఎన్నిక జరిగిందని భూపాలపల్లి జిల్లా కమిటీ సభ్యుడు కొరిపల్లి ప్రశాంత్ తెలిపారు. ఎన్ హెచ్ ఆర్ సీ మండల అధ్యక్షుడు సుంకే మధు, ప్రధాన కార్యదర్శిగా గోగుల నాగేందర్, ఉపాధ్యక్షులుగా మెరుగు నరసింహ స్వామి తో పాటు సభ్యులుగా మోతే సాంబయ్య, తుడిచర్ల దుర్గయ్య, వెన్నంపల్లి మహేష్, పత్తి మల్లేష్, తాండ్ర వెంకటరమణ, మోటం వెంకటేశ్వర్లు, కారంగుల బాపూ రావులను నియమించినట్లు ఆయన తెలిపారు.


# రోడ్లకు రూ.17 కోట్లు మంజూరు

## ఫలించిన కేఎల్‌ఆర్ కృషి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి కృషి ఫలించింది. మహేశ్వరం నియోజకవర్గానికి గ్రామీణ రోడ్లకు కన్స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీ ఆర్ ఆర్) రూ. 17 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని కే ఎల్ ఆర్ హర్షం వ్యక్తం చేశారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లో బీటీ రోడ్ల విస్తరణ, బ్రిడ్జిల మరమ్మతులకు ఈ నిధులు వియోగిస్తామని కిచ్చెన్న తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్య మంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు లక్ష్మారెడ్డి. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించేలా ప్రభుత్వ పెద్దలను కలిసి గతంలో వినతిపత్రాలు అందజేశారు. ఫోర్త్ సిటీ, ఫార్మా, మెట్రో కారిడార్, హెల్త్, ఎడ్యుకేషన్ హాబ్‌లతో మహేశ్వరం నియోజకవర్గం మహానగరంగా మారుతున్న తరుణంలో రోడ్ల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేయటం హర్షనీయమని కేఎల్‌ఆర్ తెలిపారు. ఇప్పటికే ఫాక్స్ కాన్ లాంటి అంతర్జాతీయ కంపెనీలతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తుందని కే ఎల్ ఆర్ తెలిపారు.

## ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ సురామాంబ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ బరిగల హేమలత రాజు గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుక్కుగూడ గ్రామానికి చెందిన బరిగల హేమలత రాజు గౌడ్ నూతనంగా చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా తుక్కుగూడ గ్రామ గౌడ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. బడుగు బలహీన వర్గాలకు గొంతుకగా స్థానికంగా ఉన్న ప్రతి సమస్య పరిష్కరించే విధంగా అన్ని విధాలుగా ముందుంటానని హేమలత రాజు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ గ్రామానికి చెందిన నేతలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ కమిటీ నూతన చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కొత్తూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్ హేమదేవేందర్. (విశ్వంభర, షాద్ నగర్)



# ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు ఎన్నాళ్లీ శ్రమదోపిడి..

## పనికి తగ్గ జీతం వచ్చేవరకు పోరాడుదాం

### ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ పిలుపు




**విశ్వంభర, హైదరాబాద్** : గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి నేషనల్ హెల్త్ మిషన్ స్కీం లో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన జీతం ఇవ్వకుండా శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నరసింహ విమర్శించారు. నేడు కోటి లోని ఎన్ హెచ్ ఎం కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ రకాల క్యాడర్ల ఉద్యోగులతో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎన్ హెచ్ ఎం స్కీములో వివిధ క్యాడర్లుగా పని చేయుచున్నటువంటి ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కానీ, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ గైడెన్స్ ప్రకారం కానీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చట్టం ఉన్నప్పటికీ అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ విధానం తీసుకువచ్చిన సందర్భంలో ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనాన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు చెల్లించే పద్ధతి ఉన్నదని, కానీ గత పది సంవత్సరాలుగా ఆ విధానాలకు తిలోధకాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారం తక్కువ జీతాలతో ఉద్యోగులతో పనులు నిర్వహించుకుంటున్నదని ఈ విషయంపై గతంలో అనేక సందర్భాలలో అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కి తెలియజేసినా సమస్య పరిష్కారం కానందుకు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేయుచున్నటువంటి ఉద్యోగులకు అనారోగ్యం బారిన పడితే ఎలాంటి హెల్త్ ఇన్సూరెన్స్ లేకుండా ఉన్నదని, క్యాజువల్ లీవులు కానీ వేతనంతో కూడిన మేటర్నిటీ లీవులు కానీ అమలు కావటం లేదని వారు తెలియజేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, 10 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లాంటి సౌకర్యాలు కల్పించే వరకు పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు రాజేష్ ఖన్నా మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల క్రితం వచ్చినటువంటి పీఆర్సీ సందర్భంగా ఇవ్వవలసిన ఏడు నెలల ఏరియాస్ బకాయిలకై నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతున్నా నేటికి కూడా విడుదల చేయకపోవడం అన్యాయమని వారు విమర్శించారు. నిత్యం ఉద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన యాపుల ద్వారా ఆన్లైన్ నిర్వహిస్తున్నామని, ఉద్యోగులకు అవసరమైన సెల్ ఫోన్ గాని నెట్ సౌకర్యం కానీ అధికారులు కల్పించడం లేదని, సౌకర్యాలు కల్పించకుండా విధులు నిర్వహించాలని అడగటం అన్యాయమని వారు తెలియజేశారు. గత పది సంవత్సరాలుగా సంవత్సరానికి ఒకసారి ఇచ్చే ఐదు శాతం ఇన్సెంటివ్ కూడా ఉద్యోగులకు ఇవ్వడం లేదని, రోజురోజుకు పని ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ ఉద్యోగుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు అధికారులకు ఆలోచన లేకపోవడం అన్యాయమని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం రెండవ ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల, కోశాధికారి పద్మ, జ్యోతి, డి కరుణ, కృష్ణవేణి, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఈఓ కృష్ణవేణికి అందజేశారు.

# హైడ్రా మరింత బలపడింది..

## అనధికారిక భవనాల కూల్చివేత అధికారం కూడా హైడ్రాకు లభించింది: కమిషనర్ రంగనాథ్



**విశ్వంభర, హైదరాబాద్:** మహా నగరంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు సంబంధించి హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అనధికారిక భవనాల కూల్చివేత అధికారం కూడా హైడ్రాకు లభించిందన్నారు. నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు జీహెచ్ఎంసీ చట్టంలోని అధికారాలను బదిలీ చేస్తూ పురపాలకశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఆ ఉత్తర్వులపై స్పందించిన కమిషనర్ రంగనాథ్.. జీహెచ్ఎంసీ చట్ట సవరణతో హైడ్రాకు పూర్తి స్థాయి అధికారాలు వచ్చాయన్నారు. ఇకపై ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే కూల్చివేతలు, స్వాధీనం సహా తదితర అధికారాలన్నీ హైడ్రాకు లభించాయని రంగనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల హైడ్రా మరింత బలపడిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం, ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలకు పురపాలక చట్టం ప్రకారం హైడ్రా నడుచుకుంటుందని తెలిపారు. తాజా ఉత్తర్వులతో రానున్న రోజుల్లో అక్రమ నిర్మాణాల పాలిట హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరించబోతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇటీవల కొన్ని నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టుల నుంచి యథాతథ స్థితి కొనసాగించాలన్న ఆదేశాలు ఉన్న నేపథ్యంలో కొంత ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం కోర్టులు స్టే ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకుండా గతంలో కూల్చివేతల ఆదేశాలున్న వాటిపై హైడ్రా దృష్టి సారిస్తోంది.

# ఐటీఐలో కొత్త కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లి నందు కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ నందు ప్రాంతీయ ఉప సంచాలకులు, భూపాలపల్లి, కాజీపేట ఐఐటీ ప్రిన్సిపాల్స్ తో అడ్వాన్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు భూపాలపల్లి, సుభాష్ నగర్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ https:/iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లిలోని ఖాళీగా వున్న సీట్లు భర్తీ కొరకు 6వ విడత వాక్ – ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 19 ఉదయం 11 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు నేరుగా వాక్ ఇన్ – ఇంటర్వ్యూ ద్వారా కూడా హాజరు కావొచ్చని తెలిపారు. 17 అక్టోబర్ 2024 నుండి 19 అక్టోబర్ 2024 తేదీ వరకు ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లి, సుభాష్ కాలనీ నందు హాజరుకావాలని ఆయన సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్, ప్రాసెస్‌కంట్రోల్, ఆటోమేషన్ ఒక సంవత్సరపు కోర్సులో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఒక సంవత్సరపు కోర్సులో 40 సీట్లు, ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్డ్ టూల్స్ ఒక సంవత్సరం కాల వ్యవధి కోర్సులో 40 సీట్లు, బేసిక్ డిసైనర్ అండ్ వర్చ్యువల్‌వెరిఫైర్ (మెకానికల్) 2 సంవత్సరాల కాలపరిమితి కోర్సులో 24 సీట్లు, అడ్వాన్స్డ్ సీఎన్సీ మేషనింగ్ టెక్నీషియన్ 2 సంవత్సరాల కాల పరిమితి కోర్సులో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్2 సంవత్సరాల కాల పరిమితి కోర్సులో 24 సీట్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేయునప్పుడు పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ, 10వ తరగతి సర్టిఫికెట్ లో ఉన్న విధంగా మాత్రమే దరఖాస్తులో నమోదు చేయాలని అన్నారు. ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, ఆధార్ కార్డ్ నంబర్ దరఖాస్తులో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఆధార్ కార్డ్ మరియు 10వ తరగతి సర్టిఫికెట్ లో పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ ఆ విధంగా మాత్రమే ఉండాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లి నందు కానీ లేదా మొబైల్ నంబర్ 8985100563 కు కాల్ చేసి కానీ సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సమయం రెండు రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీఐ కళాశాలలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి అలాగే విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ ఉప సంచాలకులు బి సీతారాములు, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ జూమ్లా నాయక్, కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు



**విశ్వంభర, సూర్యాపేట:** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసులను స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే జరుపుకుంటున్నామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సమాజ రక్షణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ ఈనెల 21వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. యువత, విద్యార్థులు బాగమై అమర పోలీసులకు నివాళి ఘటించాలి అన్నారు. పోలీస్ విధులు, టెక్నాలజీ ఉపయోగం పై పోలీస్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహిస్తామని, అత్యవసర సమయంలో బాధితులకు అందించడానికి రక్తదాన శిబిరం నిర్వహించి రక్తం సేకరిస్తామని, అమరవీరుల కుటుంబాల సందర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారని అమరులైన పోలీసులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ, సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని, పోలీసు ప్రతిభ తెలిపే లఘు చిత్రాల పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు ఉంటాయని అన్నారు. సినిమా థియేటర్స్ నందు పోలీసు ప్రతిభను తెలిపే చిత్రాల ప్రదర్శన ఉంటుంది అని ఎస్పీ పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. మొదటి విభాగంలో 12వ తరగతి విద్యార్థుల వరకు 'విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం' అనే అంశంపై, రెండోవ విభాగంలో డిగ్రీ ఆపై విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాల పై వ్యాసం రాయాలి అన్నారు. ఈ వ్యాస రచన పోటీలో పాల్గొనవలసినదిగా కోరుతున్నామని చెప్పారు. రెండు విభాగాల్లో ఎంపిక చేసిన ఉత్తమ మూడు వ్యాసాలకు బహుమతి ప్రధానం చేస్తాము మరియు ఆ వ్యాసాలను సంబంధిత జిల్లా పోలీసు అధికారిక సోషల్ మీడియా పేజీలలో పోస్ట్ చేయటం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ మూడు వ్యాసాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుంది అన్నారు.

**లఘు చిత్రాలు, ఫోటోల పోటీలు:** పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తక్కువ నిడివి గల షార్ట్ ఫిల్మ్స్, రీసెంట్ ఫోటోలు, ఆర్టికల్ లపై కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అన్నారు. ఆసక్తి గల వారు వారి వద్ద ఉన్న షార్ట్ ఫిలిమ్స్, పోలీసు ప్రతిభ తెలిపే రీసెంట్ ఫొటోస్, న్యూస్ ఆర్టికల్స్‌ను జిల్లా పోలీసు కార్యాలయం నందు పోలీసు ప్రజల సంబంధాల అధికారికి ఈ నెల 27వ తేదీలోగా అందించాలన్నారు. వివరాలకు 7013923377 ను సంప్రదించాలని అన్నారు. పోలీసు సిబ్బందికి రెండు విభాగాల్లోను వ్యాసరచన పోటీలు ఉంటాయని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.

# బీఆర్ఎస్ సీనియర్ నేత ఫరీదుద్దీన్ మృతి

## నివాళులు అర్పించిన మాజీ మంత్రులు



**విశ్వంభర, నల్లగొండ:** బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ సబిహుద్దీన్ ఫరీద్ హైదరాబాద్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీష్ రెడ్డి నల్లగొండ జిల్లా మునుగోడు రోడ్ ఖబరస్థాన్‌లో జరిగిన అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆయన మృత దేహానికి నివాళులు అర్పించారు. సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫరీదుద్దీన్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేసిన నాయకుడని ప్రశంసించారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. ఆయన మరణం తమకు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. వారి వెంట జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# దూసుకొస్తున్న వాయుగుండం..

## పలు జిల్లాలకు ఆకస్మిక వరద ముప్పు



**విశ్వంభర, అమరావతి:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 15 కి.మీ వేగంతో దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటికే దక్షిణకోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు.. నెల్లూరుకు 370 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ వాయవ్య దిశగా 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని ప్రకటించింది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



**వికారాబాద్, విశ్వంభర : వికారాబాద్ టౌన్ నూతన సిఐగా భీమ్ కుమార్ భాద్యతలు చేపట్టారు. ఇంతకుముందు దారూర్ మండలంలో కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం బదిలీ మీద వికారాబాద్ టౌన్ సిఐగా భాద్యతలు తీసుకున్నారు.**

# మున్సిపల్ కమీషనర్‌ను వెంటనే బదిలీ చేయాలి

## ఏఐటీయూసీ




**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్న మున్సిపల్ కమీషనర్ సాబీర్ అలీని ఘట్కేసర్ మున్సిపాలిటీ నుండి వెంటనే ట్రాన్స్ఫర్ చేయాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కట్లూరి జయచంద్ర మున్సిపల్ కార్మికులకు మద్దతుగా ఘట్కేసర్ మున్సిపాలిటీ ఆవరణలో ధర్నా నిర్వహించారు. కట్లూరి జయచంద్ర కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మున్సిపల్ పాలసీలో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుండి నాన్ స్టాప్‌గా ఎనిమిది గంటలు పనిచేసే పద్ధతిఉన్నా ఘట్కేసర్ మున్సిపల్ కమీషనర్ సాబీర్ అలీ మాత్రం రెండు పూటలా డ్యూటీ చేయాలని కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని, మున్సిపల్ కార్మికులను డ్యూటీ నుంచి తొలగిస్తున్నారని చెప్పడంతో విధి లేని పరిస్థితులలో మున్సిపల్ ఆవరణలో ఆందోళన చేశామని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు నరసింహ, రామచందర్, సువర్ణ, అరుణ, రామ్ కుమార్, అండాలు, బాలకృష్ణ, నాగేష్, ఈరమ్మ, బాల్ నరసింహ, నాగమణి, రాష్ట్ర మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు జై చారి పాల్గొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం..

## ఏపీకి చెందిన ముగ్గురు మృతి

**విశ్వంభర, చిత్తూరు:** అమెరికాలోని రాండాల్ఫ్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిదుగురు ప్రవాస భారతీయులు మృతి చెందారు. వారిలో ఒక మహిళ సహా ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. రాష్ట్ర రహదారిపై దక్షిణ బాన్‌హామ్‌కు ఆరు మైళ్ల దూరంలో సాయంత్రం 6.45 గంటలకు (అమెరికా కాలమానం) రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు టెక్సాస్ పబ్లిక్ సేఫ్టీ వర్గాలు తెలిపాయి. ప్రమాదానికి సంబంధించి పూర్వాపరాలు, మృతుల వివరాలు తెలియాల్సి ఉందని అక్కడి ప్రవాస భారతీయ ప్రతినిధులు తెలిపారు. ఘటనను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# నేడు వారిజాల వేణుగోపాలస్వామి మాస కళ్యాణం



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** తెలంగాణలో ప్రసిద్ధ గాంచిన వేణుగోపాలస్వామి దేవాలయాలలో ఒకటిగా విరాజిల్లు తున్న నార్కెట్ పల్లి మండలం లోని గోపాలపల్లిగుట్ట పైన కొలువైన వారిజాల వేణుగో పాల స్వామి మాస కళ్యాణం గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించడం జరుగుతుందని దేవస్థాన వ్యవ స్థాపక ధర్మ కర్త కోమటిరెడ్డి మోహన్ రెడ్డి తెలియజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుంది అని తెలిపారు.

# జనవరిలో అసెంబ్లీ, ఐకానిక్ భవనాలకు టెండర్లు..

## మిగిలిపోయిన పనులకు రూ.524కోట్లకు పాలనా అనుమతి

## అదనపు వరదనీటి కోసం ఆరుచోట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రణాళికలు

## సీఆర్డీయే భేటీలో కీలక నిర్ణయాలు



**విశ్వంభర, అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీయే అథారిటీ 38వ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్‌ల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్ల వద్ద మిగిలిపోయిన పనుల కోసం రూ.524 కోట్లకు పాలనా అనుమతి ఇచ్చారు. 18 టవర్లుగా, 432 అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం పనులు చేపట్టేందుకు పాలనా అనుమతి మంజూరు చేశారు.అమరావతిలో సీఆర్డీయే ప్రధాన కార్యాలయం జీ ప్లస్ 7గా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.160 కోట్లతో అనుమతి ఇచ్చారు. సీఆర్డీయే, ఏడీసీ, పురపాలక శాఖలోని అన్ని హెచ్ఓడీ కార్యాలయాలు ఈ భవనంలోనే వచ్చేలా నిర్మాణం చేపట్టనున్నారు. కొండవీటి వాగు, పాలవాగు నుంచి వచ్చే వరద నీటిని గ్రావిటీ కెనాల్‌లో వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. నెదర్లాండ్స్ నుంచి గ్రావిటీ కెనాల్‌కు సంబంధించిన డిజైన్లు కూడా తీసుకున్నారు. అదనపు వరదనీటి కోసం ఆరు చోట్ల రిజర్వాయర్లను నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. డిసెంబరులోపు అన్ని పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తై పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ భవనాలకు సంబంధించిన పనులు 2025 జనవరికల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

# జమ్ముకశ్మీర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని 'షేర్ యే కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా తదితరులు ఉన్నారు.కాగా ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమిఅక్కడ అధికారం చేపట్టింది. 2018లో కూటమి సర్కారు కూలిపోవడంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసింది. అనంతరం ఇప్పుడే తొలసారిగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

### జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకప్పటి జమ్ముకశ్మీర్ రాష్ట్రం జమ్ముకశ్మీర్, లఢఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయిన చాలా రోజుల తర్వాత తొలిసారి జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్ని కల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఘన విజయం సాధించడంతో.. ఆ పార్టీ అగ్రనేత ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీంకు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా గుర్తిం పు పొందారు. గతంలో ఆయన జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు.జమ్ముకశ్మీర్ ప్రాంతానికి ఇవాళ తొలి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జమ్ముకశ్మీర్ ప్రాంత అభివృద్ధి కోసం తాము ఒమర్ అబ్దుల్లా సర్కారుతో కలిసి పనిచేస్తామని చెప్పారు. కాగా ఒమర్ అబ్దుల్లా బుధవారం మధ్యాహ్నం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సక్సేనా ఆయనచేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, యూపీమాజీ సీంఎ అఖిలేష్ యాదవ్ తదితరులు ఉన్నారు. కాగా ప్రమాణస్వీకారానికి ముందు ఒమర్ అబ్దుల్లా కూడా జమ్ముకశ్మీర్ అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తానని చెప్పారు.

### జమ్ముకశ్మీర్ డిప్యూటీ సీఎంగా సురేందర్ చౌదరి..



జమ్ము ప్రాంతానికి చెందిన సురేందర్ చౌదరి డిప్యూటీ సీఎంగా, సకీనా మసూద్, జావేద్ దార్, జావేద్ రాణా, సతీష్ శర్మ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్ము ప్రజల వాయిస్ కోసం, తన ప్రభుత్వాన్ని కలుపుకొని పోయేందుకు నౌషేరాకు చెందిన ఎన్సీ నేత సురేందర్ చౌదరిని డిప్యూటీ సీఎంగా ఎన్నుకున్నట్లు ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అందరినీ వెంట తీసుకెళ్లడమే తమ ప్రయత్నమని అన్నారు. ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. అయితే కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీకి మంత్రి వర్గంలో ఇంకా స్థానం కల్పించలేదు.కాగా, పీడీపీ, బీజేపీ మాజీ సభ్యుడైన సురేందర్ చౌదరి, జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనాను నౌషేరా నుంచి 7,819 ఓట్ల తేడాతో ఓడించారని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఈ ప్రభుత్వం తమదేనని జమ్మూ ప్రజలు భావించేందుకే ఈ ప్రాంతానికి చెందిన చౌదరిని ఉప ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్లు చెప్పారు.మరోవైపు 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నౌషేరా నుంచి పీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సురేందర్ చౌదరిని బీజేపీ అభ్యర్థి రవీందర్ రైనా పది వేల ఓట్ల మార్జిన్‌తో ఓడించారు. 2022లో పీడీపీకి రాజీనామా చేసిన సురేందర్ చౌదరి బీజేపీలో చేరారు. ఏడాదిపాటు ఆ పార్టీలో ఉన్న ఆయన 2023 జూలైలో ఎన్సీలో చేరారు.

### అది ముళ్ల కిరీటమే: ఫరూక్ అబ్దుల్లా



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం అనంతరం ఆయన తండ్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం బాధ్యత ముళ్ల కిరీటం లాంటిదని.. ప్రజల ఆశలను నెరవేర్చడంలో దేవుడు తన తనయుడికి అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు."ప్రస్తుతం రాష్ట్రం ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఈ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని నేను నమ్ముతున్నాను" అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కొత్త ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత రాష్ట్ర హోదా పునరుద్ధరణ అని ఒమర్ అబ్దుల్లా కుమారుడు జహీర్ అబ్దుల్లా పేర్కొన్నారు.శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు హాజరయ్యారు. వీరితో పాటు ఇండియా కూటమికి చెందిన ఇతర నేతలు వచ్చారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత ఏర్పాటైన తొలి ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ వెలుపలి నుంచి మద్దతు ప్రకటించింది.

## మరో రెండు విమానాలకు బాంబు బెదిరింపులు



**బెంగళూరు:** దేశంలో పలు విమానాలకు బాంబు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ఏకంగా పలు సంస్థలకు చెందిన ఏడు విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా బెంగళూరు వెళ్తున్న అకాశా ఎయిర్ ఫ్లైట్ , ఢిల్లీకి వస్తున్న ఇండిగో విమానానికి గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఆకాశా ఎయిర్‌లైన్ సంస్థకు చెందిన క్యూఆర్1335 విమానం 184 మంది ప్రయాణికులు, సిబ్బందితో బుధవారం ఢిల్లీ నుంచి బెంగళూరుకు బయల్దేరింది. అయితే, విమానం టేకాఫ్ అయిన వెంటనే బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించారు. అక్కడ మధ్యాహ్నం 2 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు.మరోవైపు ముంబై నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. 6ఈ 651 ముంబై నుంచి బయల్దేరగా.. అలర్ట్ వచ్చింది. దీంతో పైలట్ విమానాన్ని అహ్మదాబాద్‌కు దారి మళ్లించారు. అక్కడ విమానం సేఫ్‌గా ల్యాండ్ అయినట్లు ఇండిగో ప్రతినిధి ఒకరు తెలిపారు.

## సీఎం సిద్ధరామయ్యపై తీవ్ర ఆరోపణలు.. ముడా చీఫ్ రాజీనామా..!



బెంగళూరు: కర్ణాటకలో ముడా కేసు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ముడా'లో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ముడా చీఫ్ కె.మరిగౌడ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాలు చూపుతూ ముడా చీఫ్ పదవికి బుధవారం రాజీమైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (%వీఖణూ%) భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు. ముడా నుంచి తన భార్యకు అనుచితంగా లబ్ధి కలిగించినట్లు సీఎంపై ఆరోపణలున్నాయి. దీంతో కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ వివాదం నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు ఇటీవలే వెనక్కి కూడా తీసుకున్నారు. ముడా కుంభకోణం నేపథ్యంలో, తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఈ కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై విచారణ కొనసాగుతోంది.ఇక ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయన సన్నిహితుడుగా భావిస్తున్న ముడా చీఫ్ రాజీనామా చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## వయనాడ్‌లో వెలిసిన ప్రియాంక గాంధీ పోస్టర్లు



**వయనాడ్:** ఇప్పటివరకు పార్టీ ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లోకి అడుగుపెట్టారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ కోసం హస్తం పార్టీ ప్రచారాన్ని మొదలు పెట్టేసింది. ఇందులో భాగంగానే వయనాడ్‌లో ప్రియాంక గాంధీ పోస్టర్లు వెలిశాయి. పార్టీ ప్రకటనతో నగర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రియాంక పోస్టర్లను ఏర్పాటు చేశారు.కాగా, ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ సోదరుడైన రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో పోటీ చేసిన విషయం తెలిసిందే. రాయ్‌బరేలీ, వయనాడ్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత రాయ్‌బరేలీని అట్టే పెట్టుకుని వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో సోదరుడి రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి హస్తం పార్టీ ప్రియాంక గాంధీని బరిలోకి దింపింది. ఇక ఈ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికను నిర్వహించనుంది. నవంబర్ 13న ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ మంగళవారం ప్రకటించింది.ఈసీ ప్రకటన వెలువడిన వెంటనే వయనాడ్‌లో ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ప్రియాంక అక్కడ పోటీ చేయడం ద్వారా క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి పార్టీ రంగం సిద్ధం చేసింది. పార్టీ ప్రకటన పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. రాత్రికి రాత్రే నగర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రియాంక పోస్టర్లను ఏర్పాటు చేశారు.

## చిత్తూరులో ఆలయాన్ని ధ్వంసం చేసిన దుండగులు.. సీఎం సీరియస్

**విశ్వంభర, చిత్తూరు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ఆలయంపై దాడి జరిగింది. చిత్తూరు జిల్లాలో ఆంజనేయ స్వామి ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు.చిత్తూరు ములకలచెరువు మధ్య గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పునాదులతో సహా ఆలయాన్ని పెకిలించారు. గేట్లు ధ్వంసం చేశారు. దుండగుల దుశ్చర్యతో ఆలయం ఓ వైపుకు ఒరిగింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానిక నేతలు తెలిపారు. మరోవైపు ఆలయంపై దాడి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

## శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన నయాబ్ సింగ్ సైనీ.. నేడు సీఎంగా ప్రమాణం



**చండీఘర్:** హర్యానా బీజేపీ శాసనసభాపక్ష నేతగా నయాబ్ సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పంచకులలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సైనీని శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. దీంతో రేపు ఆయన (అక్టోబర్ 17) హర్యానా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.ఇటీవలే జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 స్థానాలకు గానూ బీజేపీ 48 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ కేవలం 37 సీట్లకే పరిమితమైంది. ఈ ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా కమలం పార్టీకే మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ ముందుకొచ్చింది. ఇక సైనీని రెండోసారి సీఎంగా కొనసాగించేందుకు బీజేపీ అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేసింది. శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన సైనీకి హోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి మనో హర్ లాల్ ఖట్టర్, పార్టీ ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు.మార్చి నెలలో మనోహర్ లాల్ ఖట్టర్‌ను తప్పించి బీసీ నేత అయిన నయాబ్ సింగ్ సైనీని సీఎం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. గురువారం పంచకులలో ఆ రాష్ట్ర సీఎంగా నయాబ్ సింగ్‌సైనీ ప్రమాణంచేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ , పలువురు కేంద్ర మం త్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరు కానున్నట్లు తెలుస్తోంది.

## పంట వ్యర్థాల దహనం కేసులో హర్యానా,పంజాబ్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం..



### చీఫ్ సెక్రటరీలకు సమన్లు

**న్యూఢిల్లీ:** పంజాబ్, హర్యానా ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాల దహనం కేసులో .. ఆ రెండు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా హాజరై, అక్టోబర్ 23వ తేదీన పరిస్థితిని వివరించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, అసానుద్దీన్ అమానుల్లా, ఆగస్టిన్ జార్జ్ మాషిస్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆ కేసులో ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీలో వాయు కాలుష్యం కేసులో విచారణ చేపడు తున్న ధర్మాసనం.. రెండు రాష్ట్రాలకు కార్యదర్శులకు వారం రోజుల గడవు ఇస్తున్నట్లు పేర్కొన్నది. పంజాబ్, హర్యానా ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోలేకపోతున్న కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్‌పై కూడా సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాల కాల్చివేతను నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారని సీఏక్యూఎంను సుప్రీం అడిగింది. ఇదేమీ రాజకీయ అంశం కాదు అని కోర్టు చెప్పింది. చీఫ్ సెక్రటరీ ఎందుకు నిర్లిప్తంగా ఉన్నారని, వాళ్లకు సమన్లు జారీ చేస్తామని, వచ్చే బుధవారం భౌతికంగా కోర్టు ముందు హాజరుకావాలని, హర్యానాలో ఇప్పటి వరకు ఏమీ జరగలేదని, పంజాబ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా వ్యవహరిస్తోందని, చీఫ్ సెక్రటరీల ప్రవర్తన ఆమోదయోగ్యంలేదని, గడిచిన మూడేళ్లలో ఒక్కరిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని కోర్టు తెలిపింది.

## ఇన్సులిన్ ఇవ్వకపోతే ఆరోజే చనిపోయేవాడిని: కేజ్రీవాల్

**ఢిల్లీ:** మద్యం కుభకోణం కేసులో అరెస్టైన ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. జైల్లో ఉన్న తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా చంపేందుకు భాజపా కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జనసంపర్క్ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. అయితే తిహాడ్ జైలు అధికారవర్గాలు ఈ ఆరోపణలను ఖండించాయి. ఆయనకు అన్ని వైద్యసౌకర్యాలు కల్పించినట్టు స్పష్టం చేశాయి.'నాకు మధుమేహం లెవల్స్ పెరగడంతో.. రోజు నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటాను. జైల్లో ఉన్న నేను ఇన్సులిన్ తీసుకోకపోతే కిడ్నీలు పాడైపోయి చనిపోయేలా వాళ్లు (భాజాపాను ఉద్దేశిస్తూ) కుట్రలు పన్నారు. మీ అందరి ఆశీస్సులతో నేను బయటకు వచ్చాను. గత 10 ఏళ్లలో లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డంపెట్టుకుని దిల్లీలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఆపేందుకు ప్రయత్నించారు. కానీ, నేను వారి ప్రయత్నాలను తిప్పికొట్టాను. దిల్లీలో పనులు ఎందుకు ఆపాలనుకుంటున్నారు?. పంజాబ్‌లో మా పార్టీ విజయం సాధించాక.. దిల్లీలో పనులు ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆప్ అధికారంలోకి వస్తుందని భయపడుతున్నారు. నేను జైల్లో ఉండగా దిల్లీ అభివృద్ధి పనులు ఆపేశారు. తిరిగి నేను జైలు నుంచి వచ్చాక మా పార్టీ వాటిని ప్రారంభించింది' అని ఆయన పేర్కొన్నారు.



ఇక, తాను ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేయడానికి గల కారణాలను వివరిస్తూ ఢిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ లేఖ రాశారు.

# నిజ్జర్ కేసు దర్యాప్తునకు సహకరించని భారత్

**కెనడా ఆరోపణలు తీవ్రమైనవి**

**ఇండియా వాటిని సీరియస్‌గా పరిగణించాలి**

**అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్**





**వాషింగ్టన్:** సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు కెనడాకు భారత్ సహకరించడం లేదని అమెరికా ఆరోపించింది. భారత్?పై కెనడా చేస్తున్న ఆరోపణలు చాలా తీవ్రమైనవని పేర్కొంది. వాటిని భారత్ తీవ్రంగా పరిగణించి కెనడాతో దర్యాప్తునకు సహక రించాలని యూఎస్ కోరుకుంటోందని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యా నించారు. కానీ, ఢిల్లీ దీనికి భిన్నమైన మార్గాన్ని ఎంచుకుందని తెలిపారు. "భారత్– కెనడా దౌత్య వివాదంపై ఏమీ మాట్లాడను. కానీ భారత్?పై కెనడా చేస్తున్న ఆరోపణలు చాలా తీవ్రమైనవి. భారత్ వాటిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు కెనడా కు భారత్ సహకరించాలి. " అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మీడియాతో వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వం వ్యవస్థీకృత నేరాల ద్వారా కెనడా పౌరులపై దాడి చేయడానికి, సొంత గడ్డపైనే వారికి అరక్షిత వాతావరణం కల్పించడానికి తన దౌత్యవేత్తలను నియమించిందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. సిక్కు వేర్పాటువాది నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు సహకరించలేదని విమర్శించారు. నిజ్జర్ హత్యకు సంబంధించి వివరాలను అమెరికాకు అందజేసినట్లు ఇటీవల మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు కెనడాకు భారత్ సహకరించాలని అమెరికా వ్యాఖ్యానించడం గమనార్హం.

**'వాణిజ్య ఒప్పందాలు కొనసాగుతాయి'**

భారత్– కెనడా మధ్య ఘర్షణ వేళ కెనడా వాణిజ్య మంత్రి మేరీ ఎన్?జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ కెనడా పౌరులను సొంత గడ్డపై బెదిరించడం, వారికి హాని కలిగించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు.

**'భారత దౌత్యవేత్తలపై చర్యలు తీసుకోవాలి'**

సిక్కు వేర్పాటువాది నిజ్జర్ హత్యలో కొందరు భారతీయ దౌత్యవేత్తల ప్రమేయం ఉందని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ ఆరోపించిన మరుసటి రోజే న్యూ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జగ్మీగ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత దౌత్యవేత్తలపై కఠినమైన ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే కెనడా సహా ఇతర దేశాలలో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్?పై నిషేధం విధించాలని కోరారు. కాగా, జగ్మీత్ సింగ్ గతంలో జస్టిన్ ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. ఇటీవలే ఆయన ట్రూడో సర్కార్?కు తన మద్దతును ఉపసంహరించుకున్నారు.

**'సిక్కు సమాజం స్పందించాలి'**

భారత్?పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు. కెనడా పౌరులపై హింసాత్మక దాడులకు పాల్పడిన భారత దౌత్యవేత్తల గురించి స్పందించాలని సిక్కు సమాజాన్ని కోరారు. రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అధిపతి మైక్ డుహెమ్. ఈ కేసు విచారణకు సంబంధించిన ఏదైనా విషయం తెలిస్తే తమకు చెప్పాలని కోరారు.

## ట్రోన్ షో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

**అక్టోబరు 22, 23 తేదీల్లో 5,500 డ్రోన్‌లతో అద్భుతమైన డ్రోన్ ఎక్స్‌పో**

**ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఇది కీలక పరిణామం : సీఎం చంద్రబాబు**



**విశ్వంభర, అమరావతి:** భారత దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సమ్మిట్‌కు అమరావతి వేదిక కానుండటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అక్టోబరు 22, 23 తేదీల్లో 5,500 డ్రోన్‌లతో అద్భుతమైన డ్రోన్ షో జరగనుందన్నారు. అమరావతి కేంద్రంగా అతిపెద్ద డ్రోన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, డ్రోన్ టెక్, ఇన్నోవేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఇది కీలక పరిణామం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రోన్ నిపుణులతో కలిసి ఈ అతిపెద్ద వేడుక కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు ఔత్సాహికుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. డ్రోన్ హ్యాక్‌థాన్‌కు యువత భారీ స్థాయిలో పోటీ పడుతున్నారు. ఇప్పటికే 400 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఔత్సాహికుల సౌలభ్యం కోసం నమోదు గడువును మరో రెండ్రోజులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గురువారం (17వ తేదీ) వరకు హ్యాక్‌థాన్ పోటీకి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్ తెలిపారు. నగదు బహుమతి కూడా పెంచామని వెల్లడించారు.

## ఉచిత ఇసుక విధానంపై ఫిర్యాదులు..

**సీఎం చంద్రబాబు ఆగ్రహం**



**విశ్వంభర, అమరావతి:** ఎన్డీయే ప్రభుత్వం ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరి తీరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. కేబినెట్ సమావేశం అనంతరం ఉచిత ఇసుక విధానంపై అమాత్యులతో ఆయన కీలకంగా చర్చించారు. ఉచిత ఇసుక విధానం ఫిర్యాదులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. 10 రోజుల్లో మార్పు రాకుంటే ఉపేక్షించనని స్పష్టం చేశారు. ఏ స్థాయిలో తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇసుక విరివిగా దొరకాలన్నారు. అన్ని బంధనాలు తొలగించి, రవాణా, తవ్వకం ఛార్జీలు కూడా వీలైనంత తక్కువ ధర ఉండేలా చర్యలు తీసుకుంటూ ఉచిత ఇసుక అందించి తీరాలని తేల్చి చెప్పారు. ఇసుక తవ్వుకుని తీసుకెళ్తే రుసుము వసూలు చేయవద్దని సీఎం ఆదేశించారు. ఇసుక అక్రమాలు జరగకుండా ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆంక్షల పేరుతో అధికారులు వేధిస్తున్నారని ఈ సందర్భంగా కొందరు మంత్రులు సీఎం దృష్టికి తెచ్చారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఇకపై అలా ఉండకూడదని సీఎం వివరించారు.

## రంగును బట్టి పార్టీని ఎలా డిసైడ్ చేస్తారు?: ఏపీ హైకోర్టు



**విశ్వంభర, అమరావతి:** అన్న క్యాంటీన్‌లకు టీడీపీ రంగులు వేస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గతంలో గ్రామసచివాలయాలకు బ్లూ కలర్ తొలగించాలని తీర్పు ఇచ్చిన విషయాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రంగును బట్టి పార్టీని ఎలా డిసైడ్ చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. అన్నా క్యాంటీన్‌కు ఇంతకుముందు ఏ రంగులు వేశారని అడిగింది. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి

**మేయర్ సహా 15మంది మృతి**

**కూలిన భవనాల శిథిలాల నుంచి మృతదేహాల వెలికితీత**

**ఇంకా కొనసాగుతున్న సహాయక చర్యలు**



**బీరుట్:** దక్షిణ లెబనాన్‌లోని ఖనా నగరంపై మంగళవారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మేయర్ అహ్మద్ కహిల్ మరణించినట్లుగా నబాతియే ప్రావిన్స్ గవర్నర్ హువైదా టర్క్ ప్రకటించారు. ఈ దాడుల్లో మేయర్‌తో సహా 15మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. "పౌరుల నివాస స్థలాల మధ్య ఉన్న హెజ్‌బొల్లా మిలిటెంట్ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడటంతో మేయర్ సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. దాడిలో కూలిన భవనాల శిథిలాల నుంచి 15 మృతదేహాలను వెలికి తీశాం. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి" అని లెబనాన్ సివిల్ డిఫెన్స్ పేర్కొంది. ఆదివారం దక్షిణ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాల(యూనిఫిల్)పై ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) చేసిన దాడుల్లో 15 మంది ఐరాస సైనికులు గాయపడ్డారు. ప్రమాదకర ప్రాంతాల నుంచి, హెజ్‌బొల్లాకు పట్టున్న ప్రాంతాల నుంచి తక్షణమే ఐరాస దళాలు వైదొలగాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు డిమాండ్ చేశారు. దక్షిణ లెబనాన్‌పై భూతల దాడులు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 250 మందికి పైగా హెజ్‌బొల్లా ఫైటర్లు మరణించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. వీరిలో 21 మంది కమాండర్లు ఉన్నట్లు తెలిపింది. మొత్తంగా హెజ్‌బొల్లాకు సంబంధించి సైనిక సామర్థ్యాలను భారీగా దెబ్బతీశామని.. అయినప్పటికీ ఇజ్రాయెల్‌పై దాడి చేసే సామర్థ్యాలు వారివద్ద ఉన్నట్లు చెప్పింది. కాగా ఇజ్రాయెల్‌లోని బిన్యామినా ప్రాంతంలోని సైనిక స్థావరమే లక్ష్యంగా ఇటీవల హెజ్‌బొల్లా భీకర డ్రోన్ దాడి చేసింది. ఆ దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారు. 60 మందికిపైగా గాయపడ్డారు. లెబనాన్‌లో ఐడీఎఫ్ గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత హెజ్‌బొల్లా చేసిన అతిపెద్ద దాడి ఇది.

## 20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ

**విశ్వంభర, కర్నూలు:** ఈ నెల 20 వ తేదీ న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ విలీన సభ గోడపత్రికను బుధవారం కర్నూలు నగరంలో ఐ ఎఫ్ టీయూ ఆటో స్టాండు దగ్గర పోస్టర్ విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు తిరుపాల్ మాట్లాడుతూ జరిగే ఈ బహిరంగ ప్రకటన తర్వాత టీయూసీఐ గా తెలంగాణలో కొనసాగుతుంది దీనిని కార్మికులు మిత్రులు అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము దశాబ్దాలుగా ఐఎఫ్ టీయూతో అనుబంధం కొనసాగింది ఐఎఫ్ టీయూ ను వదులుకోవడం కూడా అంత సులభంగా లేదు రాష్ట్రంలోని కార్మిక వర్గానికి పేగు బంధం లాంటిది అయితే అదే పేరుతో రెండు మూడు సంఘాలు కొనసాగుతున్నందున దానిని వదులుకొని టియుసిఐ గా కొనసాగాలని నిశ్చయించాము అనంతరం మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల్ పై సమాన పనికి సమాన వేతనం కోసం కనీస వేతనాల జీవో సవరణ కోసం రాబోయే ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్భవించాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉన్నది ఈ విషయాన్ని అన్నిటిని చర్చించుకొని భవిష్యత్తు దిశ నిర్దేశానికై అలాగేదేశ జనాభా లో 45 కోట్ల కార్మికుల్లో కేవలం 6 కోట్ల మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారు. మిగతా 39 కోట్లకు పైగా ఉన్న అ సంఘటిత కార్మికులు కడు దరిద్రంలో జీవిస్తున్నారు. కనీస వేతనాలు లేవు. ఈఎస్ఐ, ఈపీఎఫ్, గ్రాట్యుటి, పెన్షన్లు లేవు సామజిక భద్రత లేదు మొత్తంగా ట్రేడ్ యూనియన్ నిర్మాణమే లేకుండా గాలిలో దీపంలా అభద్రతా జీవితాలు జీవిస్తున్నారు. కార్మికుల భద్రత కై వచ్చిన భీమా చట్టం "ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు, ఈఎస్ఐ కార్మికులకు ఎలాంటి దీమా నివ్వడం లేదు భవిష్యతే లేని కార్మికులకు భవిష్యత్ భద్రత చట్టం (పీఎఫ్)వల్ల ఎం ఉపయోగమో ఆలోచించాలి. 1978లో ఐఎఫ్‌టీయూ ఏర్పడింది నాటి నుండి నేటి వరకు ఐఎఫ్‌టీయూ అనుబంధం గా వివిధ కార్మిక సంఘాలను నిర్మాణం చేస్తూ వచ్చాం అన్నారు. 26 రకాల కార్మికుల చట్టభద్ద యూనియన్లు అనుబంధం చేశాము. కనుక ఈ నెల 20 న నిర్వహించే విలీన సభకు హాజరై విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్నికి పిలుపునిచ్చార్ .ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శ్రీను, మోహన్ రాజు ,వెంకటేష్ ,చిన్న రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీవారి మెట్టు నడక మార్గం మూసివేత : టీటీడీ



**విశ్వంభర, తిరుమల :** భారీ వర్షాల కారణంగా తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు నడక మార్గాన్ని గురువారం వరకు మూసివేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. భారీ నుంచి అతి భారీ వర్షాలుపడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు బుధవారం టీటీడీ ఉన్నతాధికారులతో వర్చువల్ గా సమావేశాన్ని నిర్వహించారు.భారీ వర్షాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఘాట్ రోడ్లలో జేసీబీలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. విద్యుత్ కు అంతరాయం కలకగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐటీ వింగ్ భక్తుల దర్శనాలు, వసతి, ప్రసాదం వంటి కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. వైద్య శాఖ అంబులెన్సు లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే అగ్ని మాపక సిబ్బంది వేగంగా స్పందించేందుకు అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పాపవినాశనం, శిలా తోరణం మార్గాలను టీటీడీ మూసివేసింది. వాతావరణ పరిస్థితులను బట్టి ఈ మార్గాల్లో రాకపోకలను టీటీడీ పునరుద్ధరించనుందని తెలిపారు.

## కక్ష పూరితంగా వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు : సజ్జల



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కక్షపూరితంగా తప్పుడు కేసులు నమోదు చేయిస్తుందని వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తన ప్రమేయం లేకున్నా చివరకు నా పేరును కేసులో నమోదు చేయించారని మండిపడ్డారు.తాను ఢిల్లీ నుంచి గ్వాలియర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా తనకు నోటీసులివ్వడం దారుణమన్నారు. పోలీసు వ్యవస్థను చంద్రబాబు నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ నాయకులపై పెడుతున్న కేసులపై న్యాయవ్యవస్థకు వెళుతామని, తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఏపీలో ప్రభుత్వం అనేది ఉందా ? అరాచకానికి ఒక హద్దు ఉండదా అంటూ అనుమానం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం లేదని అన్నారు. పాలన ఇష్టారీతిన కొనసాగుతుందని ఆరోపించారు. కూటమి నాయకులు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో స్కాం జరిగిందని ఈడీ గుర్తించి ఆస్తుల అటాచ్‌మెంట్ చేసిందని తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు ప్రమేయం ఉందని ఈడీ భావిస్తుందని అన్నారు.నాడు చంద్రబాబును జగన్ కక్షపూరితంగా అరెస్టు చేయలేదని, విచారణ జరిపిన తరువాత అరెస్టు చేశారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి వైఎస్ జగన్‌ను ఇరికించాలని, ప్రత్యర్థులను భయభ్రాంతులను చేయాలి, వైసీపీని పూర్తిగా నాశనం చేయాలనే ఉద్దేశంతో కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు.

# 20 సార్లు హత్యాయత్నాలు

## హత్యకు గురైన తండ్రి

**సోదరుడిని బలిగొన్న ఉగ్రవాదులు**

**రాజకీయాల్లో రాణించి మంత్రిగా ఎదిగిన సకీనా ఈటూ**



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయగా.. ఆయనతో పాటు ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమే సకీనా ఈటూ. సకీనా.. దక్షిణ కశ్మీర్‌కు చెందిన కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపు దక్కించుకున్నారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు.

**జమ్మూ ప్రజల వాయిస్ కోసమే..**

జమ్మూలోని నౌషేరా నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీ ఈ రోజు డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ ప్రాంతం ప్రజల గళాన్ని వినిపించేందుకు ఆయన్ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. "ఈ ప్రభుత్వంలో తమకు ప్రాతినిధ్యం వహించేవారు లేరని జమ్మూ ప్రజలు బాధపడాల్సిన పనిలేదు. ఆ ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని ఎంపిక చేశాను. దీంతో ఈ ప్రభుత్వం తమదని స్థానిక ప్రజలు భావిస్తారు" అని సీఎం అన్నారు.

## అక్టోబరు 19న శ్రీవారి ఆర్జితసేవా ఆన్‌లైన్ టికెట్ల జనవరి కోటా విడుదల

**విశ్వంభర, తిరుమల :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన 2025 జనవరి నెల కోటాను అక్టోబరు 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబరు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ టికెట్లు పొందిన వారు అక్టోబరు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయన్నారు.

**22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను అక్టోబరు 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని వివరించారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన జనవరి నెల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని ప్రకటించారు.

**అక్టోబరు 23న అంగప్రదక్షిణం టోకెన్లు..**

జనవరి నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను అక్టోబరు 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జనవరి నెల ఆన్ లైన్ కోటాను ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల



శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా జనవరి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల..**

జనవరి నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు , తిరుమల, తిరుపతిలలో జనవరి నెల గదుల కోటాను అక్టోబరు 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

## ముంబై ఇండియన్స్‌లోకి టీమిండియా మాజీ కోచ్..!




**విశ్వంభర క్రీడా విభాగం :** ఐపీఎల్ 2025 సీజన్ కోసం ముంబై ఇండియన్స్ సిద్ధమవుతోంది. ఐపీఎల్ 2024 సీజన్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో జట్టు ప్రక్షాళనపై ముంబై ఇండియన్స్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రిటెన్షన్ జాబితాను సిద్ధం చేయడంతో పాటు వేలంలో కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్లపై కసరత్తు చేస్తోంది. మరోవైపు కోచింగ్ విభాగంలో భారీ మార్పులు చేస్తోంది. ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్‌గా వ్యవహరించిన మార్క్ బౌచర్‌ను తొలిగించి మళ్లీ మహేల జయవర్ధనేకు ఆ బాధ్యతలు అప్పగించింది. తాజాగా టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రేను కోచింగ్ బృందంలోకి తీసుకుంది. ప్రస్తుతం బౌలింగ్ కోచ్‌గా ఉన్న లసిత్ మలింగాతో కలిసి పరాస్ మాంబ్రే పనిచేయనున్నాడు.

పరాస్ మాంబ్రే నియామకానికి సంబంధించి ముంబై ఇండియన్స్ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటనను విడుదల చేసింది. పరాస్ మాంబ్రే గతంలో ముంబై ఇండియన్స్ సపోర్ట్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 గెలవడంలో పరాస్ మాంబ్రే బౌలింగ్ కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. అదే తరహా ఫలితాన్ని రాబట్టేందుకు ముంబై ఇండియన్స్ కోచ్ అతన్ని నియమించినట్లు తెలుస్తోంది.

ఐపీఎల్ 2025 మెగా వేలం నిర్వహణపై బీసీసీఐ ఫోకస్ పెట్టింది. నవంబర్ 31న మెగా వేలం నిర్వహించేందుకు కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ రూల్స్‌ను ప్రకటించింది. ప్రతీ జట్టుకు ఆరుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇందులో గరిష్టంగా ఐదుగురు క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉండాలనే నిబంధన పెట్టింది.

విదేశీ ఆటగాళ్లపై ఎలాంటి పరిమితి విధించలేదు. ఆరుగురి ఆటగాళ్లను నేరుగా రిటైన్ చేసుకోవచ్చు లేదా ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా వేలంలో తిరిగి కొనుగోలు చేయవచ్చు. రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు, రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, అయిదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ.18 కోట్లు, రూ.14 కోట్లు చెల్లించాలి.

అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను రిటైన్ చేసుకుంటే మాత్రం రూ.4 కోట్లు చెల్లించాలి. ఫ్రాంచైజీల పర్స్ వాల్యూను రూ. 120 కోట్లకు పెంచారు. అక్టోబర్ 31వ తేదీలోపు రిటెన్షన్ జాబితాలను సమర్పించాలని ఫ్రాంచైజీలను బీసీసీఐ ఆదేశించింది.

## డివిలియర్స్‌కు విరాట్ కోహ్లీ స్పెషల్ విషెస్



**విశ్వంభర క్రీడా విభాగం :** సౌతాఫ్రికా మాజీ స్టార్ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ 2024లో చోటు సంపాదించాడు. డివిలియర్స్‌తో పాటు ఇంగ్లాండ్‌కు చెందిన అలిస్టర్ కుక్, భారత్ మాజీ మహిళా క్రికెటర్ నీతూ డేవిడ్‌కు కూడా ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా దిగ్గజ క్రికెటర్ డివిలియర్స్‌ని అభినందిస్తూ, మాజీ సహచరుడు టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఓ లేఖ రాశాడు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో డివిలియర్స్ చేరడం తనకు ఎంత గౌరవంగా అనిపించిందని కోహ్లీ తన లేఖలో తెలిపాడు. డివిలియర్స్‌ను అత్యంత ప్రతిభావంతుడైన క్రికెటర్‌గా అభివర్ణించాడు. అతడు తన స్కిల్స్‌పై మాత్రమే కాకుండా, సొంత బలాన్ని కూడా నమ్ముతాడని చెప్పాడు.

డివిలియర్స్‌తో కలిసి ఆడిన ఇన్నింగ్స్‌ల్లో తనకు ఇష్టమైన ఒక సందర్భాన్ని విరాట్ లేఖలో రాసుకొచ్చాడు. 2016లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌లో సునీల్ నరైన్ బౌలింగ్‌లో డివిలియర్స్ బాదిన 94 మీటర్ల సిక్స్‌ను ప్రస్తావించాడు. నాన్‌స్ట్రైకర్స్ ఎండ్‌లో ఉన్న తాను, డివిలియర్స్ సింగిల్ తీస్తాడని భావించాడు. కానీ, డివిలియర్స్ భారీ షాట్ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మైదానంలో ఇలాంటి ఊహించని, అపురూపమైన విన్యాసాలు చేయగలగడం డివిలియర్స్‌కి మాత్రమే సాధ్యమని అన్నాడు. అతడు ఒక 'ఫ్రీక్' అని కోహ్లీ ఆప్యాయంగా పిలిచాడు.

డివిలియర్స్ ప్రతిభ

ఎవ్వరికీ సాధ్యం కాని విభిన్న, భారీ షాట్లు ఆడటం మాత్రమే కాదని, ఆపదలో జట్టును ఆదుకోవడం కూడా డివిలియర్స్ ప్రత్యేకత అని విరాట్ అన్నాడు. దూకుడుగా ఆడినా, ఆడకపోయినా అతడికి తన సామర్థ్యంపై ఎప్పుడూ నమ్మకం ఉందని కోహ్లీ కొనియాడాడు. డివిలియర్స్ మ్యాచ్‌పైనే కాకుండా, ప్రేక్షకుల మనసులపై కూడా ప్రభావం చూపగలడనని అన్నాడు. ఈ విధానమే అతడిని ప్రత్యేకంగా నిలబెట్టిందని వివరించాడు. ఇప్పటివరకు తాను కలిసి ఆడిన గొప్ప ఆటగాళ్లలో డివిలియర్స్ ఒకడని పేర్కొన్నాడు.

లెజెండరీ కెరీర్

ఏబీ డివిలియర్స్ 14 సంవత్సరాల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరఫున అన్ని ఫార్మాట్లలో 20,000 కంటే ఎక్కువ పరుగులు సాధించాడు. తన కెరీర్‌లో దక్షిణాఫ్రికా అనేక విజయాల్లో డివిలియర్స్ కీలక పాత్ర పోషించాడు. ఇక 2018లో అతడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. ఇక ఐపీఎల్‌లో చివరిసారిగా 2021లో ఆడాడు. ఆ తర్వాత పూర్తిగా క్రికెట్‌కు దూరమయ్యాడు.

# ఎస్ఆర్‌హెచ్ రిటెన్షన్ లిస్ట్ రెడీ

### ఆ ప్లేయర్ కోసం ఏకంగా రూ.23 కోట్లు!

**విశ్వంభర క్రీడా విభాగం :** 2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్మె గా వేలానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్రి టైన్ చేసుకొనే ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఐపీఎల్ వేలానికి సంబంధించిన రిటెన్షన్ నిబంధనలను ఇటీవల బీసీసీఐ ఖరారు చేసింది. మొత్తంగా ఒక్కో ఫ్రాంచైజీ గరిష్ఠంగా ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడానికి అనుమతి ఇచ్చింది. మరి సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఎవరెవరిని అట్టిపెట్టుకునే ఛాన్స్ ఉందంటే?




### రూ.23 కోట్లకు హెన్రిచ్ క్లాసెన్?

దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌ను రాబోయే సీజన్‌కి తొలి ఆప్షన్‌గా తీసుకోవాలని భావిస్తోంది. తొలి ఆప్షన్‌గా రిటైన్ చేసిన ఆటగాడికి బీసీసీఐ రూ.18 కోట్ల ధరను నిర్ణయించింది. అయినా క్లాసెన్ కోసం రూ.23 కోట్లు చెల్లించడానికి ఫ్రాంచైజీ సిద్ధంగా ఉందని సమాచారం. 2024లో క్లాసెన్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. 15 ఇన్నింగ్స్‌ల్లో 171.07 స్ట్రైక్ రేట్‌తో 479 పరుగులు చేశాడు.

### మిగతా ఇద్దరు వాళ్లే!

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ పాట్ కమిన్స్, యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మను కూడా రిటైన్ చేయాలని ఎస్ఆర్‌హెచ్ నిర్ణయించుకుందట. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన కమిన్స్‌ను రూ.18 కోట్లకు అట్టిపెట్టుకొని, అభిషేక్ కోసం రూ.14 కోట్లు వెచ్చించడానికి రెడీ అయిపోయిందని తెలుస్తోంది.

గత సీజన్‌లో కమిన్స్ 18 వికెట్లతో సత్తా చాటగా, 2024 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్లలో అభిషేక్ ఒకడు. ఏకంగా 204.21 స్ట్రైక్ రేట్‌తో 484 పరుగులు చేశాడు. ఓపెనర్‌గా జట్టుకి కళ్లు చెదిరే ఆరంభాలు అందించాడు.

### వాళ్లూ ఎస్ఆర్‌హెచ్ తోనే?

ఆస్ట్రేలియన్ డాషింగ్ బ్యాటర్ ట్రావిస్ హెడ్, టీమ్ ఇండియా యంగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని కూడా తిరిగి జట్టులోకి సిద్ధంగా ఉంది. ట్రావిస్ హెడ్ 2024లో అత్యుత్తమంగా రాణించాడు. ఓపెనర్‌గా 191.55 స్ట్రైక్ రేట్‌తో 567 పరుగులు చేశాడు. అటు ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్‌గా ఎంపికైన నితీష్ కుమార్ రెడ్డి బ్యాట్‌తో పాటు బంతితోనూ ఆకట్టుకున్నాడు. 11 మ్యాచ్‌లలో 142.92 స్ట్రైక్ రేట్‌తో 303 పరుగులు చేసి, మూడు వికెట్లు తీశాడు.

ఈ ఆటగాళ్లను రిటైన్ చేయాలని సన్‌రైజర్స్ దాదాపు సిద్ధమైపోయినట్లు సమాచారం. తర్వాత మెగా వేలంలో ఎస్ఆర్‌హెచ్ జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే మిగిలిన స్క్వాడ్‌ను కొనుగోలు చేయడంలో తెలివిగా వ్యవహరించాలి. అప్పుడే బలమైన జట్టుతో 2025 ఐపీఎల్ టైటిల్ వేటలో దిగవచ్చు.

## కివీస్‌తో తొలి టెస్టు.. తొలి రోజు ఆట రద్దు



**బెంగుళూరు:** బెంగుళూరులో వర్షం కురుస్తోంది. దీంతో కివీస్, భారత్ (IND Vs NZ) మధ్య ఇవాళ ప్రారంభం కావాల్సిన టెస్టు మ్యాచ్ ఆలస్యం అవుతోంది. ఇప్పటికే తొలి రెండు సెషన్లు ముగిశాయి. చిన్నస్వామి స్టేడియంలో ఇంకా కొన్ని కవర్స్ అలాగే ఉన్నాయి. బెంగుళూరులో ఉదయం నుంచి అడపాదడపా జల్లు కురుస్తోంది. టీ టైం కూడా పూర్తి కావడంతో.. ఇవాళ ఆట జరిగేది అనుమానంగా ఉన్నది. మరో వైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్.. ఇండోర్ ప్రాక్టీస్ చేశారు. టీ బ్రేక్ తర్వాత .. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్ ను కైవసం చేసుకున్న రోహిత్ సేన.. న్యూజిలాండ్‌పైనా అదే దూకుడును ప్రదర్శించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. గత కొన్నాళ్ల ప్రదర్శన ఆధారంగా చూసినా ప్రస్తుత ఫామ్ పరంగా చూసుకున్నా.. ఈ సిరీస్‌లో టీమ్ఇండియానే తిరుగులేని ఫేవరేట్‌గా ఉంది. శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్ ఫామ్‌లో ఉండటం.. టెస్టులలో పునరాగమనం తర్వాత వికెట్ కీపర్ రిషభ్ పంత్ దూకుడు.. స్పిన్ ఆల్‌రౌండర్లు అశ్విన్, జడేజా ఆల్‌రౌండ్ షో.. బుమ్రా నేతృత్వంలోని పేస్ బలగం.. ఇలా అన్ని విభాగాల్లోనూ భారత్ దుర్భేద్యంగా ఉంది.

కానీ కివీస్ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. గత ఐదు టెస్టులలో ఆ జట్టు 4 మ్యాచ్‌లలో ఓడటం.. ప్రధాన బ్యాటర్లంతా ఫామ్‌లేమితో సతమతమవుతుండగా బౌలర్ల ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉన్న నేపథ్యంలో ఆ జట్టు భారత్‌ను ఎలా అడ్డుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. న్యూజిలాండ్‌తో సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేస్తే ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకునే అవకాశముంది.

### తుది జట్లు అంచనా

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్/ సర్ఫరాజ్ ఖాన్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, ఆకాశ్‌దీప్/ కుల్‌దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్

న్యూజిలాండ్: దేవన్ కాన్వే, టామ్ లేథమ్, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్, బ్రాస్‌వెల్, టిమ్ సౌథీ, అజాజ్, ఒరూర్కె టా

## బీసీసీఐ సంచలన నిర్ణయం
## కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌పై వేటు!



**విశ్వంభర క్రీడా విభాగం :** దుబాయ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో భారత జట్టు సెమీ ఫైనల్‌కు చేరలేకపోయింది. పేలవమైన ప్రదర్శనతో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. ఫలితంగా ఐసీసీ ఈవెంట్లలో భారత మహిళల జట్టుకు కప్ అందని ద్రాక్షగానే మిగిలింది. అంతేగాక ఈ సారి సెమీస్‌కు కూడా చేరుకోకపోవడం వల్ల బీసీసీఐ చర్యలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. టీమ్ ఇండియా మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌పై వేటుకు బీసీసీఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

హర్మన్ కెప్టెన్సీపై నిర్ణయం హర్మన్ ప్రీత్ కెప్టెన్సీ భవితవ్యంపై సెలక్షన్ కమిటీ, ప్రధాన కోచ్ అమోల్ ముజుందార్‌లతో బీసీసీఐ మరికొద్ది రోజుల్లో సమావేశం కానుందని తెలిసింది. ఈ మీటింగ్‌లో హర్మన్ ప్రీత్ కెప్టెన్సీపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అలాగే 2025లో భారత్‌లోని మహిళల వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈ మెగాటోర్నీలో భారత్ విజేతగా నిలిచేలా కార్యచరణ సిద్ధం చేయాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలో హర్మన్ ప్రీత్ స్థానంలో మరొకరికి కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

వేటు తప్పదా? 2016లో టీ20 వరల్డ్ కప్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్‌కు వెళ్లలేకపోయింది. ఈ దశలో మిథాలీ రాజ్ నుంచి టీ20 జట్టు పగ్గాలను హర్మన్ ప్రీత్ కౌర్ అందుకుంది. 2020 టీ20 ప్రపంచకప్‌లో జట్టును ఫైనల్‌కు చేర్చింది. అయితే దుబాయ్ వేదికగా జరుగుతున్న తాజాగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో జట్టును సెమీస్‌కు చేర్చడంలో విఫలమైంది. అందుకే ఆమెపై వేటు పడనున్నట్లు తెలుస్తోంది.

'ప్లేయర్ గా ఆమె ఢోకా లేదు' హర్మన్ ప్రీత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించినా జట్టులో ప్లేయర్‌గా ఆమె స్థానానికి ఢోకా లేదు. అయితే భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు జట్టు పగ్గాలు అప్పగించి, వన్డే వరల్డ్ కప్‌నకు టీమ్ ఇండియాను సిద్ధం చేసే యోచనలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. "హర్మన్ ప్రీత్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలా? లేదా కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలా? అనే విషయంపై బీసీసీఐ కచ్చితంగా చర్చిస్తుంది. జట్టు కోరుకున్న ప్రతిదాన్ని బీసీసీఐ అందించింది. జట్టును నడిపించేందుకు కొత్త సారథి అవసరమయ్యే సమయం ఆసన్నమైందని భావిస్తున్నాం. హర్మన్ ప్రీత్ జట్టులో ప్లేయర్‌గా ఉంటారు." అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

## హాకీ వీరులకు జాక్‌పాట్..




**ఢిల్లీ:** రెండ్రోజుల పాటు ఢిల్లీ వేదికగా జరిగిన హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) వేలంలో సుమారు 250 మంది ఆటగాళ్లు పేర్లు నమోదుచేసుకోగా భారత సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ రూ. 78 లక్షల (సూర్మా హాకీ క్లబ్)తో అత్యధిక ధర దక్కించుకున్నాడు. అభిషేక్ నాయిన్ (రూ. 72 లక్షలు, శార్చి రార్ బెంగాల్ టైగర్స్), హార్దిక్ సింగ్ (రూ. 70 లక్షలు, యూపీ రుద్రాస్), గొంజలొ పీలట్ (రూ. 68 లక్షలు, హైదరాబాద్ టైటాన్స్), జిప్ జనాస్సెన్ (రూ. 54 లక్షలు, తమిళనాడు గ్రాడన్స్)లు టాప్ 5లో నిలిచారు. విదేశీ ఆటగాళ్లలో గొంజలొకే అత్యధిక ధర దక్కింది. మహిళల విషయానికొస్తే భారత డిఫెండర్ ఉదితా దుహన్ (రూ. 32 లక్షలు, బెంగాల్ టైగర్స్) అత్యధిక ధర దక్కించుకుంది.

---

### రిలయన్స్ జియో కొత్త సంచలనం
## ఒక్క యాప్ సాయంతో కంప్యూటర్‌లా స్మార్ట్ టీవీ

**ఢిల్లీ:** రిలయన్స్ జియో మరో కొత్త సంచలనానికి సిద్ధమైంది. ఒక్క యాప్ సాయంతో స్మార్ట్ టీవీని కంప్యూటర్‌లా మార్చుకునే సౌకర్యాన్ని రూపొందించింది. ఈ టెక్నాలజీని ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ 2024 ఈవెంట్‌లో ప్రదర్శించింది. జియో క్లౌడ్ పీసీగా పిలిచే ఈ సాంకేతికతతో కొన్ని వందల రూపాయలతోనే మీ స్మార్ట్ టీవీని కంప్యూటర్‌గా మార్చుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఇంటర్నెట్ సౌకర్యం, కీబోర్డు, మౌస్, స్మార్ట్ టీవీ ఉంటే చాలు.. జియో క్లౌడ్ పీసీ యాప్ ఉపయోగించి టీవీని కంప్యూటర్‌లా మార్చుకోవచ్చని జియో పేర్కొంది. యాప్‌లో లాగిన్ అయ్యి కంప్యూటర్ తరహాలోనే ఈమెయిల్స్, మెసేజింగ్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ బ్రౌజింగ్ వంటివి చేసుకోవచ్చు. ఈ డేటా మొత్తం క్లౌడ్‌లో స్టోర్ అవుతుంది. మధ్యతరగతి కుటుంబానికి కంప్యూటర్ కొనుగోలు భారం కాకూడదన్న ఉద్దేశంతో ఈ కొత్త సాంకేతికను తీసుకొచ్చినట్లు జియో తెలిపింది. జియో క్లౌడ్ పీసీతో స్మార్ట్ టీవీ, కంప్యూటర్ రెండు వేర్వేరు డివైజులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని టీమ్ పేర్కొంది.




సాధారణ టీవీలను జియో ఫైబర్/ జియో ఎయిర్‌ఫైబర్ సెట్ టాప్ బాక్స్ అమర్చడం ద్వారా స్మార్ట్‌గా మార్చుకోవచ్చని పేర్కొంది. మొబైల్‌లో సైతం ఈ కొత్త సర్వీసును వాడుకోవచ్చని తెలిపింది. అయితే, ఈ యాప్‌ను ఎప్పుడు విడుదల చేసేది? ఎంత ధర ఉంటుందనే వివరాలు వెల్లడించలేదు.

### యూట్యూబ్‌లో కొత్త ఫీచర్లు
## స్లీప్ టైమర్ తో ఆటోమేటిగ్గా వీడియో ఆఫ్




**ముంబయి :** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ యూజర్లను ఆకర్షించడంలో భాగంగా కొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. స్లీప్ టైమర్, రీసైజబుల్ మినీ ప్లేయర్, ఫేవరెట్ ప్లే లిస్ట్.. ఇలా అనేక ఫీచర్లను పరిచయం చేసింది. ఈ విషయాన్ని కంపెనీ తన బ్లాగ్‌పోస్ట్ ద్వారా వెల్లడించింది. కొత్త ఫీచర్లు ఎలా పనిచేయనున్నాయో అందులో వివరంగా తెలిపింది. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూనే చాలామంది నిద్రలోకి జారుకుంటారు. ఓ వైపేమో వీడియోలు ప్లే అవుతున్నా ఆఫ్ చేయలేరు. ఈ సమస్యకు చెక్ పెడుతూ యూట్యూబ్ సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. అదే స్లీప్ టైమర్. ఈ ఫీచర్ సాయంతో టైమర్‌ని సెట్ చేసుకొని యూట్యూబ్‌లో వీడియోలు ప్లే చేయొచ్చు. మనం ఎంచుకొన్న సమయం ముగియగానే వీడియో ఆఫ్ చేయడం మర్చిపోయినా, నిద్రలోకి జారుకున్నా ఆటోమెటిక్‌గా వీడియో ఆగిపోతుంది. వీడియో ప్లే చేశాక స్క్రీన్‌పై కనిపించే సెట్టింగ్స్ ఐకాన్‌ని ట్యాప్ చేయగానే స్లీప్ టైమర్ ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మీకు కావాల్సిన సమయాన్ని ఎంచుకోవచ్చు. ప్రీమియం యూజర్లకు మాత్రమే పరిమితమైన ఈ ఫీచర్ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చింది.

## శాంసంగ్ స్మార్ట్ రింగ్ లాంచ్

### ధర రూ.38,999 నుంచి ప్రారంభం

**ఢిల్లీ :** ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ మొదటి స్మార్ట్ రింగ్‌ను లాంచ్ చేసింది. ఈ ఏడాది జులైలో పారిస్‌లో జరిగిన ఈవెంట్‌లో గెలాక్సీ జీ ఫోల్డబుల్ ఫోన్‌తో పాటు ఈ రింగ్‌ను శాంసంగ్ ఆవిష్కరించింది. తాజాగా ఈ స్మార్ట్ రింగ్‌ను భారత్‌లో తీసుకొచ్చింది. IP68 రేటింగ్‌తో తీసుకొచ్చిన ఈ రింగ్‌లో ఏఐ ఆధారిత హెల్త్ ట్రాకింగ్, స్లీప్ మానిటరింగ్ ఫీచర్లు ఉన్నట్లు కంపెనీ తెలిపింది. శాంసంగ్ తొలి ఫిట్‌నెస్ రింగ్ ధర రూ.38,999 నుంచి ప్రారంభం అవుతుందని కంపెనీ తెలిపింది. శాంసంగ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ దుకాణాల ద్వారా కొనుగోలు చేయొచ్చని పేర్కొంది. టైటానియమ్ బ్లాక్, టైటానియమ్ సిల్వర్, టైటానియమ్ గోల్డ్ రంగుల్లో లభిస్తుంది. ఈ స్మార్ట్ రింగ్ తొమ్మిది వేర్వేరు సైజుల్లో అందుబాటులో ఉంటుంది. గెలాక్సీ ఏఐ సదుపాయంతో తీసుకొచ్చిన ఈ రింగ్‌తో అనేక రకాల హెల్త్ ఫీచర్లను ట్రై చేయొచ్చని కంపెనీ చెబుతోంది. స్లీప్ స్కోర్, స్నోరింగ్ అనాలసిస్, స్లీప్ మెట్రిక్, స్లీప్ లేటెన్సీ, హార్ట్ రేట్, రెస్పిరేటరీ రేటు వంటివి ఈ రింగ్ ట్రాక్ చేస్తుంది. శాంసంగ్ హెల్త్ యాప్‌లో ఈ వివరాలన్నీ నమోదవుతాయి. ఈ రింగ్ సింగిల్ ఛార్జితో ఏడు రోజుల పాటు బ్యాటరీ లైఫ్ వస్తుందని కంపెనీ చెబుతోంది. టైటానియమ్ బాడీతో తీసుకొచ్చిన రింగ్‌లో స్మార్ట్ టచ్ కంట్రోల్స్ ఫీచర్లు ఉన్నాయి. వీటి సాయంతో ఫొటోలు తీయడం, అలారమ్ ఆఫ్ చేయడం వంటివి చేయొచ్చు.



## మారుతీ సుజుకీ స్విఫ్ట్ కొత్త ఎడిషన్

### బ్లిట్జ్ ఎడిషన్ లాంచింగ్




**ఢిల్లీ :** ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ స్విఫ్ట్‌లో కొత్తగా బ్లిట్జ్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, వీఎక్స్ఐ ఏఎంటీ, వీఎక్స్ఐ (O), వీఎక్స్ఐ (O) ఏఎంటీ.. వేరియంట్లలో కొత్త స్విఫ్ట్ లభిస్తుంది. వీటి ధర రూ.6.49 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.8.02 లక్షల (ఎక్స్ షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. స్విఫ్ట్‌లో 1.2 లీటర్ త్రీ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 82 hp శక్తిని, 112Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇక సీఎన్‌జీ వేరియంట్ 70 hp, 102 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఎడిషన్ ప్యాకేజీ కింద రూ.50 వేలు విలువైన పరికరాలను మారుతీ అందిస్తోంది. అందులో రేర్ అండర్‌బాడీ స్పాయిలర్, ఫ్రంట్ ఫ్రాగ్ ల్యాంప్స్, ఇల్యుమినేటెడ్ డోర్ సిల్స్, రియర్ అప్పర్ స్పాయిలర్, డోర్ వైజర్స్, సౌండ్ బాడీ క్లాండింగ్ వంటివి ఉన్నాయి. విక్రయాలు పెంచుకోవడంలో భాగంగా కొత్త ఎడిషన్లను విడుదల చేసినట్టు సమాచారం.

## టెలికాం పరికరాల ఎగుమతుల దిశగా హెచ్ఎఫ్ సీఎల్

### 50 శాతం ఆదాయం పొందాలని లక్ష్యం

### 5జీ గేర్‌లకు పెరుగుతున్న డిమాండ్



**ఢిల్లీ:** దేశీయ టెలికాం గేర్ తయారీ సంస్థ హెచ్ఎఫ్ సీఎల్ ఫైబర్ వచ్చే మూడేళ్లలో ఆప్టిక్ సెగ్మెంట్‌లో 70%, నెట్‌వర్క్ పరికరాల వ్యాపారంలో 50% ఆదాయాన్ని ఎగుమతుల ద్వారా పొందాలని లక్ష్యంగా పెట్టుకుంది. టెలికాం ఆపరేటర్లు దేశవ్యాప్తంగా 5జీ మొబైల్ టవర్లను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత కంపెనీకి ఇప్పుడు 5జీ గేర్‌లకు డిమాండ్ పెరుగుతోందని కంపెనీ ఎండీ తెలిపారు. కంపెనీ ఇప్పటికే 40 దేశాలకు ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను ఎగుమతి చేస్తోందని, తాజాగా టెలికాం పరికరాల ఎగుమతులను కూడా ప్రారంభించామని ఆయన తెలిపారు. దేశీయంగా అనేక 5జీ పరికరాలను రూపొందించిందని, ఇప్పుడు వాటిని విదేశాల్లో కూడా విక్రయించడం ప్రారంభించిందని ఎండీ నహతా చెప్పారు. 6జీ టెక్నాలజీకి సంబంధించి కంపెనీ ఇప్పటికే దాదాపు 15 పేటెంట్లను ఫైల్ చేసింది.

# లెక్కతప్పిన సుహాస్.. నెక్స్ట్ ఏంటి?

టాలీవుడ్‌లో ఉన్న యంగ్ యాక్టర్స్‌లో సుహాస్ నటన అందరికంటే వైవిధ్యమైనది. కెరీర్ ఆరంభం నుండే విలక్షణమైన కథలను ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాడు. అయితే నటనతో అదరగొడుతున్న సుహాస్‌కి 'కలర్ ఫోటో', 'రైటర్ పద్మభూషణం' సినిమాలు మాత్రమే కమర్షియల్ హిట్లు అందించాయి. మిగతా సినిమాలన్నీ పర్వాలేదనిపించాయి. రీసెంట్‌గా రిలీజైన 'జనక అయితే గనక సినిమా కూడా ఇదే లిస్ట్‌లోకి వెళ్ళింది. ఇంతకీ సుహాస్ సినిమాల రిజల్ట్స్‌లో వ్యత్యాసం ఎక్కడొస్తుందంటే.. అద్భుతమైన నటన అంతకు మించిన కథ.. ఇది కేవలం సుహాస్ 'జనక అయితే గనక' సినిమా విషయం మాత్రమే కాదు, ఆయన నటించిన అన్ని సినిమాల వ్యవహారం. ఇంకేంటి అన్ని హిట్స్ ఆ.. అంటే కాదు.. నటన బాగాలేకున్నా, యాక్టింగ్ బాగాలేకున్నా ఏదో ఒక లోపం ఉన్న సూపర్ హిట్ అయిన సినిమాలు కోకొల్లలు. కానీ.. అన్ని బాగానే ఉన్న సుహాస్‌కి మాత్రం లక్ కలిసి రావడం లేదు. జనక అయితే గనక సినిమా మరో 'బలగం' లేదా 'బొమ్మరిల్లు' అవుతుందన్న సుహాస్ లెక్కలు ఫలించలేదు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అండా ఉపయోగపడలేదు. మరోవైపు ఫారెన్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను కూడా సుహాస్ సొంతం చేసుకున్న ఆశించినా స్థాయిలో రిజల్ట్స్ కనిపించలేదు. కథలో బలం ఉన్నా, నటనలో సామర్థ్యం ఉన్నా సినిమాని తెరకెక్కించే విధానంలో డైరెక్టర్స్ ఫెయిల్ అవుతున్నారు. దీంతో సుహాస్ కి యావరేజ్ అండ్ ఫ్లాప్ రిజల్ట్స్ ఎదురైతున్నాయి.' ప్రసన్నవదనం', 'గొర్రె పురాణం', 'శ్రీరంగనీతులు' ఇలా ఒక్కో సినిమాలో క్యారెక్టర్ లెంగ్త్, బ్యాక్ డ్రాప్ కూడా పట్టించుకోకుండా సుహాస్ వైవిధ్యభరితమైన రోల్స్‌లో ప్రయోగాలు చేస్తున్న నిరాశ తప్పడంలేదు. ఇక అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్ 'కేబుల్ రెడ్డి', 'ఆనందరావు అడ్వెంచర్స్', 'ఉప్పు కప్పురంబు' సినిమాలతో ఎలాంటి రిజల్ట్స్ వస్తాయో వేచి చూడాల్సి ఉంది.





# అఖండ
## తాండవం ప్రారంభం




ఇండియన్ సినిమాలో అత్యంత క్రేజీ కాంబినేషన్‌గా పేరున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ , బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీనుల హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ 'సింహ, లెజెండ్ , అఖండ' చిత్రాల తర్వాత నాలుగోసారి వీరిద్దరూ కలిసి పని చేయబోతున్నారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి చిత్రం ఒకదానిని మించి మరొకటి బాలయ్యకు బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచాయి. ఇక వీరి కాంబినేషన్‌లో రాబోతోన్న నాలుగో చిత్రం బుధవారం గ్రాండ్‌గా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇదే సందర్భంలో చిత్ర టైటిల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేస్తూ.. ఇది 'అఖండ' కు సీక్వెల్ అని తెలుపుతూ.. 'అఖండ 2' టైటిల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇక ప్రారంభ విశేషాలకు వస్తే..ఈ చిత్రానికి నటసింహం బాలయ్య పెద్ద కుమార్తె నారా బ్రాహ్మణి క్లాప్ కొట్టగా.. చిన్న కుమార్తె ఎమ్. తేజస్విని నందమూరి స్విచ్చాన్ చేశారు. ప్రస్తుతం ఈ మూవీ ప్రారంభంలో క్లాప్, స్విచ్చాన్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాలయ్య కుమార్తె ఎమ్. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట , గోపీచంద్ ఆచంట ఈ 'అఖండ 2' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలయ్య సరసన 'అఖండ'లో నటించిన ప్రగ్యా జైస్వాల్ ఈ చిత్రంలోనూ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇది బాలకృష్ణ , బోయపాటి ఇద్దరికీ మొట్టమొదటి పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కబోతోంది. 'అఖండ' చిత్రానికి బ్లాక్‌బస్టర్ మ్యూజిక్ అందించిన ఎస్ థమన్ ఈ సీక్వెల్‌కి కూడా సంగీతం అందిస్తున్నారు.

# సంక్రాంతి బరిలో నాగ చైతన్య?




అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య తన 'కస్టడీ' సినిమాతో ప్రేక్షకులని ఆకట్టుకోలేకపోయాడు. గతంలో ఆయన చేసిన సినిమాలతో పర్వాలేదనిపించినా.. ఒక స్ట్రాంగ్ మూవీతో టాలీవుడ్‌లో స్టార్ ఇంప్యాక్ట్ చూపించాలని ఎన్నో రోజుల నుండి ప్రయత్నిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే కార్తికేయ 2 సినిమాతో నేషనల్ వైడ్ ఆడియెన్స్‌ని కట్టిపడేసిన డైరెక్టర్ చందు మొండేటితో ఓ సినిమా ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో మలయాళీ బ్యూటీ సాయి పల్లవి రెండోసారి చైతూతో జతకట్టనుండగా.. ఈ సినిమాని పాన్ ఇండియా ప్రాజెక్ట్ రిలీజ్ చేయడానికి గీత ఆర్ట్స్ ప్లాన్ చేసింది. ఇది వరకే రిలీజ్ కావాల్సిన ఈ సినిమా ఆలస్యం అవుతోంది. సినిమా కాన్సెప్ట్‌తోనే ఆడియెన్స్‌ని అట్రాక్ట్ చేసిన ఈ మూవీ రిలీజ్‌పై ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఆ వార్త ఏంటంటే..ప్రేమమ్, సవ్యసాచి సినిమాలతో చైతన్యకి గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చిన దర్శకుడు చందు మొండేటి.. పాన్ ఇండియా సక్సెస్ తర్వాత మరోసారి తన అదృష్టం పరీక్షించుకోకవడానికి చైతూతో 'తండేల్' అనే సరికొత్త ప్రాజెక్ట్ ప్లాన్ చేశాడు. లవ్ స్టోరీ తర్వాత సాయి పల్లవి మరోసారి చైతూతో జత కట్టగా.. గీత ఆర్ట్స్ ఈ సినిమాని నిర్మించింది. టైటిల్ రివీల్ ఆడియెన్స్‌లో ఆసక్తి నెలకొల్పిన ఈ సినిమా రిలీజ్‌పై ఉత్కంఠ రేగుతోంది. ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ మూవీ డిసెంబర్ కి వాయిదాపడినట్లు టాక్ వినిపించిన మరింత ఆలస్యం కావొచ్చు అనే వార్తలు విన్పిస్తున్నాయి. దీంతో ఈ సినిమాని అక్కినేని ఫ్యామిలీకి ఎంతో కలిసొచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు రూమర్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే సంక్రాంతి పోటీలో తండ్రి 'విశ్వంభర' ని కాదని రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'తో దూసుకొస్తున్నాడు. ఇక బాలయ్య, బాబీ సినిమా పోటీలో ఉండనే ఉంది. మరోవైపు వెంకీ మామ, అనిల్ రావిపూడి సినిమాతో బరిలో ఉన్నారు. ఈ భారీ పోటీలో ఇంతకీ నాగ చైతన్య మూవీ రిలీజ్ చేస్తారా, లేదా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు సాయి పల్లవి నటిస్తోన్న 'అమరన్' సినిమా ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకి

## యాక్షన్ కింగ్ అర్జున్ డైరెక్షన్‌లో
# బహు భాషా చిత్రం




తెలుగు, కన్నడతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ అర్జున్ . యాక్షన్ కింగ్ డైరెక్టర్ అని కూడా తెలిసిందే. చివరగా లోకేశ్ కనగరాజ్ లియోలో మెరిశాడు అర్జున్. సుమారు ఆరేండ్ల విరామం తర్వాత మళ్లీ మెగాఫోన్ పట్టాడు. అర్జున్ డైరెక్ట్ చేస్తున్న కొత్త సినిమా సీత పయనం . ఈ విషయాన్ని తెలియజేస్తూ టైటిల్ లోగో ఆవిష్కరించాడు. తాజా సమాచారం ప్రకారం మొదట ఈ సినిమాను కన్నడలో చిత్రీకరించనుండగా.. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో కూడా విడుదల చేయనున్నారట. అర్జున్ హోం ప్రొడక్షన్ బ్యానర్ శ్రీరామ్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుంటం విశేషం. ఈ ప్రాజెక్టులో ఈ చిత్రంలో కన్నడ యాక్టర్ నిరంజన్ సుధీంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఇతర లీడ్ యాక్టర్లు ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. పాపులర్ టెక్నీషియన్లు ఈ సినిమాలో భాగం కాబోతున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే 2022లో విశ్వక్ సేన్ హీరోగా ఐశ్వర్యా అర్జున్, జగపతి బాబు కాంబోలో అర్జున్ డైరెక్షన్‌లో ఓ సినిమా ప్రకటించాడని తెలిసిందే. కొన్ని రోజుల తర్వాత సినిమా రద్దైంది.



# ముందే ప్లాన్ చేశారు

ప్రస్తుతం బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్ , లారెన్స్ బిష్ణోయ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే సల్మాన్‌పై రెండు మూడు సార్లు అటాక్ జరిగింది. ఆ అటాక్ చేసిందెవరో కూడా క్లారిటీ ఉంది. దీంతో బాలీవుడ్ అంతా భయాందోళనలలో ఉంటే.. తాజాగా బాలీవుడ్ నటి రవీనా టాండన్ కొన్ని షాకింగ్ విషయాలను బయటపెట్టింది. జూన్ నెలలో రవీనా టాండన్. ఆయన డ్రైవర్‌పై ఓ గుంపు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ అటాక్‌కి కారణం డ్రైవర్ మిస్టేక్ అని అంతా ముందు అనుకున్నారు. కానీ ఇదంతా ప్రీ ప్లాన్డ్ స్కెచ్ అనేలా షాకింగ్ విషయాలను బయటపెట్టింది రవీనా టాండన్. తాజాగా రవీనా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో జూన్‌లో ఆమెపై అటాక్‌కు సంబంధించిన ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె సమాధానం ఇస్తూ..“నాపై అటాక్ జరిగిన మరుసటి రోజే రిచా చద్దా కూడా ఇలాంటి అటాక్‌కే గురైంది. ఓ గుంపు ఆమెపై కూడా ఇలానే దాచి చేసినట్లుగా తెలిసింది. అయితే ఇదంతా డబ్బుకోసం ఓ గుంపు ముందస్తుగా చేసుకున్న స్కెచ్ అని రిచా అటాక్‌తో పాటు పోలీసులు సైతం చెప్పడంతో నేను ఆశ్చర్యపోయాను. ప్రస్తుతం ముంబైలో ఇటువంటి సంఘటనలు ఎక్కువయ్యాయి. ఆ గ్యాంగ్ అంతా భయపెట్టి ఎలాగైనా డబ్బులు వసూలు చేయాలనే ప్లాన్‌లో తిరుగుతున్నట్లుగా నా దృష్టికి వచ్చింది. రిచా చద్దా కూడా నాకు ఫోన్ చేసి.. నీకు ఎలా అయితే జరిగిందో.. నాకు కూడా అలానే జరిగిందని చెప్పుకొచ్చింది. కానీ సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో.. పోలీసుల ద్వారా సెటిల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఆమెకు ఎదురైంది. తర్వాత పోలీసులే.. ఇదంతా డబ్బుకోసం ఓ గ్యాంగ్ చేస్తున్న పనిగా పోలీసులు కూడా గుర్తించారు. నా విషయంలో కూడా బెదిరించి ఎలాగైనా డబ్బు వసూలు చేయాలనే అలా అటాక్ చేశారు. నాకు బాగా గుర్తుంది. వాళ్లలో కొందరు చాలా దూకుడుగా ప్రవర్తించారు. ఆ సమయంలో నా పిల్లలు మేడపై ఉన్నారు. ఇంట్లోకి చొరబడి.. నా స్టాఫ్‌లోని మగవాళ్లని కొట్టారు. అప్పుడు నేను, నా స్టాఫ్‌లోని మరో ఇద్దరు లేడీస్ గేటుకి అడ్డంగా నిలబడి వారిని లోనికి రానియకుండా అడ్డుగా నిలుచున్నాం. అయినా సరే వినడం లేదు.. డ్రైవర్‌ని అప్పగించాలని ఒత్తిడి చేస్తూనే ఉన్నారు. నిజంగా మా డ్రైవర్‌ని తప్పు ఉంటే.. పోలీసులు వచ్చి అతనిని తీసుకెళతారని నేను చెప్పినా కూడా వినలేదు. నువ్వు ఎవరు న్యాయం చెప్పడానికి అంటూ ఆవేశంగా మీద మీదకి వస్తూనే ఉన్నారు” అని రవీనా ఈ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

# మ్యూజికల్ కన్సర్ట్‌కు రండి
## సీఎం, డిప్యూటీ సీఎంలకు డీఎస్పీ ఆహ్వానం



ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 19న జరిగే మ్యూజికల్ కార్యక్రమానికి రావాలని సీఎం, డిప్యూటీ సీఎంలను దేవిశ్రీప్రసాద్ ఆహ్వానించారు. అయితే హైదరాబాదులో మొట్టమొదటిసారిగా దేవిశ్రీప్రసాద్ ఒక లైవ్ కన్సర్ట్ నిర్వహించబోతున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ లైవ్ కన్సర్ట్ విషయంలో దేవి శ్రీ ప్రసాద్ చాలా కేర్ తీసుకుంటున్నారు. దేశ వ్యాప్తంగా లైవ్ షోస్ చేస్తానని వెల్లడించిన దేవిశ్రీప్రసాద్.. దానిని ముందుగా హైదరాబాద్ నుంచి మొదలు పెడుతున్నానని వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో దేవి శ్రీ ప్రసాద్ లైవ్ కన్సర్ట్ జరగనుంది. దీనికి సంబంధించిన టికెట్లు ఇప్పటికే నిర్వాహకులు విక్రయించారు. దేవిశ్రీ ప్రసాద్ ఇన్నాళ్లు సినీ ప్రపంచంలో సంగీత రారాజుగా తెలుగు, తమిళ్, హిందీ ఇతర భాషాల్లో సైతం సంగీతం అందించి అందరినీ ఉర్రుతలూగించారు. ఇప్పుడు లైవ్ షో ద్వారా తన సొంత ప్రజల్ని, ఆయన్ని గుండెల్లో పెట్టుకున్న అభిమానులను అలరించాడానికి సిద్ధం అయ్యారు. ఈ కార్యక్రమంలో దేవిశ్రీ వెంట నిర్మాత బండ్ల గణేష్ పాల్గొన్నారు.

# A సర్టిఫికెట్‌తో.. 25న థియేటర్లలోకి 'C 202'




మున్నా కాశీ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న హర్రర్ థ్రిల్లర్ చిత్రం 'సి 202' . గోవా బ్యూటీ షారోన్ రియా ఫెర్నాండెజ్ హీరోయిన్‌గా, తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ, అర్చన ప్రధాన పాత్రల్లో నటించారు. మైటీ ఒక్ పిక్చర్స్ బ్యానర్ పై మనోహరి కె ఎ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ నిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. మంచి డిఫరెంట్ కాన్సెప్ట్ కథతో రూపొందిన ఈ సినిమా ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికెట్ తో అక్టోబర్ 25 న గ్రాండ్ గా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. ట్రైలర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేకుండా.. కేవలం నటీనటుల హావభావాలతోనే అందరినీ ఆకట్టుకున్నారు. సౌండ్ ఎఫెక్ట్స్, కెమెరా వర్క్ ఈ చిత్రానికి ప్రధాన బలం అని ట్రైలర్ చూస్తే అందరికీ అర్థం అవుతుంది. ఇక ఇలాంటి టెక్నికల్ బ్రిల్లియెన్స్‌తో తీసిన చిత్రాన్ని ఆడియెన్స్ కచ్చితంగా ఆదరిస్తారని మేకర్స్ విశ్వాసం వెలిబుచ్చుతున్నారు. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సార్ సభ్యులు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చి సినిమా బాగుందని కొనియాడారని, సినిమాను అక్టోబర్ 25న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

# కీర్తి సురేశ్ రఘు తాతా టీవీ ప్రీమియర్




మహానటి సినిమాతో తెలుగు, తమిళంతోపాటు హిందీలో సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్. ఈ భామ లీడ్ రోల్‌లో నటించిన సినిమా రఘు తాతా . సుమన్ కుమార్ దర్శకత్వం వహించాడు. తమిళ ప్రజలపై హిందీని రుద్దే అంశం చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఆ తర్వాత ఓటీటీలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. కాగా ఈ చిత్రాన్ని థియేటర్, ఓటీటీలో మిస్సయిన వారి కోసం ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వచ్చేసింది. రఘు తాతా తెలుగు వెర్షన్ పాపులర్ జీ తెలుగు ఛానల్‌లో అక్టోబర్ 20న మధ్యాహ్నం 3 గంటలకు ప్రీమియర్ కానుంది. మరి ఈ సినిమాకు టెలివిజన్ ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. ఈ చిత్రం కేజీఎఫ్, సలార్ లాంటి బ్లాక్ బస్టర్ ప్రాంచైజీలను తెరకెక్కించిన హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌లో వచ్చింది. రఘుతాతా ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో అందుబాటులో ఉంది. ఈ చిత్రంలో ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, దేవదర్శిని, రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ మూవీకి షాన్ రోల్డన్ సంగీతం అందించాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com